


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 9 సంచిక : 154 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : కాకినాడ ఆదివారం 8 ఫిబ్రవరి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :9 ISSUE : 154 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : KAKINADA SUN 8 FEBRUARY 2026 PRICE : 1/- RS

Simultaneously Published form Kakinada,Ongole,Visakhapatnam,Bapatla,Narasarao Peta, YSR Kadapa,Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari,West Godavari,Eluru,Guntur,SPSR Nellore,Tirupati,Chittor,Kurnool,Anantapur



## వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు...
# జగన్ కు ఏంటి బాధ?

- తిరుమల లడ్డూ నెయ్యిలో కల్తీ జరిగిందన్న శ్రీనివాసవర్మ
- కల్తీ జరిగిందని వైవీ, భూమన, చెవిరెడ్డి ఇప్పుకున్నారని వ్యాఖ్య
- స్వామివారికి హారతి ఇచ్చే నెయ్యిని కల్తీ చేశారని మండిపాటు

తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వ్యవహారంపై కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్డీడీబీ నివేదిక ప్రకారం నిబంధనల ఉల్లంఘన జరిగిందని చెప్పారు. లడ్డూల తయారీకి ఉపయోగించిన నెయ్యిలో కల్తీ జరిగిందని అన్నారు. కానీ, ఈ వ్యవహారంలో వైసీపీ నేతల వ్యాఖ్యలు హాస్యాస్పదంగా

- మిగతా 2లో

## క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం..
# ఇది చారిత్రక ఘట్టం

- అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ భవనానికి శంకుస్థాపన
- ఇది కేవలం ఏపీకి కాదని, యావత్ భారతదేశ చరిత్రలో ఒక చారిత్రక రోజని సీఎం వ్యాఖ్య
- క్వాంటమ్ విప్లవానికి భారత్ నాయకత్వం వహిస్తుందన్న ధీమా
- హైదరాబాద్‌కు హైటెక్ సిటీలా, దేశానికి క్వాంటమ్ సెంటర్ గేమ్ ఛేంజర్ అవుతుందని ప్రకటన
- ఈ నెల 16న మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ అమరావతికి రానున్నట్లు వెల్లడి



"ఇది కేవలం అమరావతికో, ఆంధ్రప్రదేశ్‌కో సంబంధించిన రోజు కాదు. యావత్ భారతదేశ చరిత్రలో ఇదొక చారిత్రక దినం. గతంలో మనం వ్యవసాయ, పారిశ్రామిక విప్లవాలను అందిపుచ్చుకోలేకపోయాం. కానీ, కమ్యూనికేషన్, ఐటీ విప్లవంలో వేగంగా అడుగులు వేశాం. ఇప్పుడు ప్రపంచం ముందున్న క్వాంటమ్ విప్లవంలో మనం అనుసరించడం కాదు, ఏకంగా నాయకత్వం వహించబోతున్నాం. ఆ మహాయజ్ఞానికి అమరావతి నుంచే పునాది వేస్తున్నాం" అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. అమరావతి భవిష్యత్తును, తద్వారా దేశ సాంకేతిక ప్రగతిని నిర్దేశించే 'క్వాంటమ్ వ్యాలీ' భవన నిర్మాణానికి శనివారం కేంద్ర శాస్త్ర, సాంకేతిక శాఖ మంత్రి జితేంద్ర సింగ్‌తో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో చంద్రబాబు తన దార్శనికతను, భవిష్యత్ ప్రణాళికలను ఆవిష్కరించారు. ఆనాటి రోజులను గుర్తు చేసుకున్న చంద్రబాబు, "1995లో నేను ముఖ్యమంత్రి అయినప్పుడు బిల్ గేట్స్ ఇంటర్నెట్‌ను ఆవిష్కరించారు. అప్పుడు దాని ప్రాముఖ్యతను గుర్తించి రాష్ట్రాన్ని ఆ దిశగా నడిపించా. మాజీ ప్రధాని

- మిగతా 2లో



# సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు...
## కదిలిపోయిన పవన్ కల్యాణ్

- బురద రోడ్డుపై విద్యార్థుల ఆవేదన.. సోషల్ మీడియాలో వీడియో
- వీడియో చూసి చలించిపోయిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్
- గజ్జలవారిపల్లికి రూ.86 లక్షలతో తక్షణమే రోడ్డు మంజూరు
- కూటమి ప్రభుత్వంలో ఉదయగిరిలో రూ.55 కోట్ల రోడ్ల పనులు
- ఈ రోడ్డు మంజూరుతో విద్యార్థులు, రైతుల కష్టాలకు తెర

"పవన్ సర్.. రోజూ బురదలో నడుస్తూ స్కూలుకు వెళ్లలేకపోతున్నాం. దయచేసి మా ఊరికి రోడ్డు వేయండి" అంటూ విద్యార్థులు

- మిగతా 2లో



## ఎడిటర్ వ్యూ

# అంగరంగ వైభవంగా శ్రీశైల బ్రహ్మోత్సవాలు

తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తిపీఠం ఒకే గిరిశృంగం ద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది. పురాణాల్లో వర్ణితమైన ఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది. బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభివందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు. స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదలీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు. శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణుకుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తుసంపదలు సమర్పించారు. శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం – శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు దుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి.ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ఫిబ్రవరి 8తేదీ నుండి నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలలో భాగంగా 8న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం అధికారులు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. ఆంధప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు శ్రీశైలం క్షేత్ర మహా శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున సీఎం పట్టువస్త్రాలు అందజేస్తారు. 15వ తేదీన మహా శివరాత్రి ప్రత్యేక పూజా కార్యక్రమాలు. ప్రభోత్సవం, నంది వాహన సేవ. లింగోద్భవ కాలంలో మహారుద్రాభిషేకం, కళ్యాణోత్సవం నిర్వహించ నున్నారు. ఈ ఉత్సవాల్లో స్వామి వారు వివిధ వాహనాలను అధిరోహించి, తిరు వీధుల్లో ఊరేగుతూ భక్తులకు అనుగ్రహం కలిగిస్తారు. ప్రత్యేకించి మహాశివరాత్రి నాడు స్వామి వారికి ప్రభోత్సవం, నందివాహన సేవలతో పాటు అనేక విశేష కార్యక్రమాలను నిర్వహిస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీ కారణంగా స్వామి వారి అలంకార దర్శనానికి మాత్రమే అనుమతి ఉంటుంది. జ్యోతిర్ముడి కలిగిన శివ స్వాములకు మాత్రమే నిర్దిష్ట వేళల్లో ఉచిత స్పర్శ దర్శనానికి అవకాశం ఉంటుంది.

# శ్రీశైలంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు... సీఎం చంద్రబాబుకు ఆహ్వానం

ప్రముఖ శైవక్షేత్రం శ్రీశైలంలో ఈ నెల 8వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరగనున్న మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఆహ్వానం అందింది. శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి, ఆలయ బోర్డు ఛైర్మన్ రమేశ్ నాయుడు, ధర్మకర్తల మండలి సభ్యులు, అధికారులు నేడు అమరావతిలోని సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రిని కలిశారు.ఈ సందర్భంగా వారు సీఎం చంద్రబాబుకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికతో పాటు స్వామివారి చిత్రపటాన్ని, తీర్థప్రసాదాలను అందజేశారు. అనంతరం ఆలయ పండితులు వేదమంత్రాలతో ఆయనకు ఆశీర్వచనం అందించారు. బ్రహ్మోత్సవాల ఏర్పాట్ల గురించి ఎమ్మెల్యే, ఆలయ బోర్డు సభ్యులు ముఖ్యమంత్రికి వివరించారు.దీనిపై స్పందించిన సీఎం, ఉత్సవాలకు వచ్చే భక్తులకు అవసరమైన సౌకర్యాలు,

భద్రత, రవాణా ఏర్పాట్లపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. ఇదే క్రమంలో, నంద్యాల జిల్లాలోని మహానంది క్షేత్రంలో జరిగే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు కూడా హాజరుకావాలని ఎమ్మెల్యే రాజశేఖర్ రెడ్డి సీఎం చంద్రబాబును ఆహ్వానించారు.

# వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ?

- మొదటి పేజి తరువాయి

ఉన్నాయని విమర్శించారు. కల్తీ నెయ్యి విషయంలో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. వైవీ సుబ్బారెడ్డి, భూమన కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ముగ్గురూ కల్తీ జరిగిందని ఒప్పుకున్నారని శ్రీనివాసవర్మ అన్నారు. కల్తీ జరిగిందని వైవీ సుబ్బారెడ్డి ఒప్పుకున్నప్పుడు... జగన్ కు ఏంటి బాధ అని ప్రశ్నించారు. బోలేబాబాకు పాల ఉత్పత్తి, డెయిరీ లేకపోయినా నెయ్యి తయారు చేశారని వివరించారు. టెండర్ల నిబంధనల్లో పెద్ద ఎత్తున మార్పులు చేశారని... అవినీతి కోసం అలా చేశారని అన్నారు. ఆ నెయ్యితోనే స్వామివారికి హారతి ఇస్తామని... అలాంటి నెయ్యిని కల్తీ చేశారని మండిపడ్డారు. అర్హత లేని వారికి నెయ్యి కాంట్రాక్టు ఎలా ఇస్తారని ప్రశ్నించారుశ.

# చంద్రబాబు, జగన్ ఇద్దరూ రాయలసీమ ద్రోహులే

- మొదటి పేజి తరువాయి

ప్రాజెక్టు విషయంలో ఇరువురు నేతల వైఖరిని ఆమె తప్పుబట్టారు.వైసీపీ ప్రభుత్వంపై షర్మిల తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. "గత ఐదేళ్ల పాలనలో రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు అంశంలో నిద్రపోయిన వైసీపీ, ఇప్పుడు ఓటమి తర్వాత ఉద్యమాలు చేయడం సిగ్గుచేటు" అని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఎన్జీటీ వద్ద బలమైన వాదనలు వినిపించకుండా, కేంద్రం నుంచి అనుమతులు తీసుకురాకుండా ఇప్పుడు ఆందోళనలు ఎందుకని ప్రశ్నించారు. "ఐదేళ్లు ప్రధాని మోదీకి దత్తపుత్రుడిగా ఉన్న జగన్‌కు అప్పుడు సీమకు నీళ్లివ్వాలని గుర్తుకురాలేదా?" అని నిలదీశారు. జలయజ్ఞం ప్రాజెక్టులను 6 నెలల్లో పూర్తి చేస్తామని మ్యానిఫెస్టోలో పెట్టి, సీమ ప్రాజెక్టుల వైపు కన్నెత్తి కూడా చూడలేదని ఆమె విమర్శించారు.

మరోవైపు, ముఖ్యమంత్రి చంద్రబాబు సంగమేశ్వరం వద్ద కాకుండా ముచ్చుమర్రి వద్ద ప్రాజెక్టు కడతామని చెప్పడాన్ని కూడా షర్మిల తప్పుబట్టారు. "ఎవరిని మోసం చేయడానికి ఇద్దరూ కలిసి ఈ నాటకాలు ఆడుతున్నారు? మోదీ దగ్గర సాగిలపడి సీమకు అన్యాయం చేస్తారా?" అని ఆమె తీవ్రంగా ప్రశ్నించారు. ఇద్దరు నేతలు తమ వైఖరిని మార్చుకోవాలని, సీమ ప్రయోజనాలను కాపాడాలని ఆమె డిమాండ్ చేశారు.

# భారత వ్యాక్సిన్లు రాకపోవడం మా ఆర్థిక వ్యవస్థకు భారంగా మారింది

పహల్గామ్ ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ నుంచి అందుబాటు ధరల్లో లభించే వ్యాక్సిన్ల సరఫరా నిలిచిపోవడం పాకిస్థాన్‌కు ఆర్థికంగా భారంగా మారిందని ఆ దేశ ఆరోగ్య మంత్రి ముస్తఫా కమల్ వెల్లడించారు. భారత వ్యాక్సిన్లు గత ఏడాది నుంచి రావడం లేదని అన్నారు. వీటి దిగుమతి కోసం వందల మిలియన్ డాలర్లు ఖర్చవుతోందని, ఇది దేశ ఆర్థిక వ్యవస్థకు పెను భారంగా మారిందన్నారు.

ప్రస్తుతం ప్రతి సంవత్సరం 400 మిలియన్ డాలర్లతో వ్యాక్సిన్లను దిగుమతి చేసుకుంటున్నామని, వీటిలో 49 శాతం ఖర్చులను 'గావీ' (గ్లోబల్ అలయన్స్ ఫర్ వ్యాక్సిన్ అండ్ ఇమ్యునైజేషన్) ద్వారా పని చేసే అంతర్జాతీయ సంస్థలు, మిగతా 51 శాతం ప్రభుత్వం భరిస్తోందని వెల్లడించారు. స్థానికంగా వ్యాక్సిన్ ఉత్పత్తి ప్రారంభించకపోతే 2031 నాటికి దిగుమతి కోసం రూ.10 వేల కోట్ల వరకు ఖర్చు పెట్టాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పటికి వ్యాక్సిన్ల సరఫరాకు అంతర్జాతీయ సహకారం ముగిసిపోతుందని అన్నారు.అత్యంత పేద దేశాల్లోని పిల్లలకు వ్యాక్సిన్ అందించడానికి 'గావీ' పనిచేస్తుంది. 'గావీ' సాయంతో పాకిస్థాన్ అత్యంత చౌకగా టీకాలను సేకరించేది. వీటిలో ఎక్కువగా భారత్ నుంచే వస్తాయని, అవి అందుబాటు ధరల్లో ఉంటాయని పాకిస్థాన్ మంత్రి

వెల్లడించారు. కరోనా సమయంలో లక్షలాది కొవిడ్ వ్యాక్సిన్లను భారత్ నుంచి సేకరించడానికి 'గావీ' సహాయం చేసిందని అన్నారు.పాకిస్థాన్ ప్రభుత్వం ప్రస్తుతం పౌరులకు 13 రకాల వ్యాక్సిన్లను ఉచితంగా అందిస్తోంది. అయితే ఏ వ్యాక్సిన్‌ను కూడా స్థానికంగా ఉత్పత్తి చేయడం లేదు. 24 కోట్ల జనాభాతో ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన ఐదో దేశంగా పాకిస్థాన్ ఉంది. ప్రతి సంవత్సరం 62 లక్షల జననాలు నమోదవుతుండటంతో వ్యాక్సిన్లకు డిమాండ్ పెరిగింది.

# ఎలాన్ మస్క్ స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడులు..

బిలియనీర్ ఎలాన్ మస్క్ నేతృత్వంలోని ఏరోస్పేస్ సంస్థ 'స్పేస్‌ఎక్స్' వ్యవహారంపై సమీక్ష జరపాలని ఇద్దరు అమెరికన్ డెమొక్రటిక్ సెనేటర్లు డిమాండ్ చేశారు. ఈ సంస్థలో చైనాకు చెందిన పెట్టుబడిదారులు రహస్యంగా వాటాలు కొనుగోలు చేశారని, ఇది అమెరికా జాతీయ భద్రతకు పెను ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేరకు రక్షణ శాఖ (ఋణ) కార్యదర్శి పీట్ హెగ్సెత్‌కు వారు లేఖ రాశారు. మసాచుసెట్స్ సెనేటర్ ఎలిజబెత్ వారెన్, న్యూజెర్సీ సెనేటర్ ఆండీ కిమ్.. రక్షణ శాఖకు రాసిన లేఖలో ఈ ఆందోళనలను ప్రస్తావించారు. స్పేస్‌ఎక్స్ రక్షణ శాఖకు ఒక ప్రధాన కాంట్రాక్టర్‌గా ఉందని గుర్తుచేశారు. ఇటీవల బయటపడిన కోర్టు రికార్డులు, మార్చిలో వచ్చిన ఒక ప్రోపబ్లికా పరిశోధనాత్మక కథనాన్ని వారు తమ లేఖలో ఉటంకించారు. ఆఫ్‌షోర్ ఖాతాల ద్వారా స్పేస్‌ఎక్స్‌లో చైనా పెట్టుబడిదారులకు వాటాలు కొనుగోలు చేసేందుకు అవకాశం కల్పిస్తున్నారని ఈ నివేదికలు ఆరోపిస్తున్నాయి."వ్యూహాత్మక రంగాల్లో ప్రత్యర్థి దేశాల నుంచి వచ్చే విదేశీ పెట్టుబడుల విషయంలో ప్రభుత్వ విధానాలకు ఇది విరుద్ధం. కీలకమైన సైనిక, నిఘా, పౌర మౌలిక సదుపాయాలను ఇది ప్రమాదంలో పడేస్తుంది" అని సెనేటర్లు పేర్కొన్నారు. రక్షణ శాఖతో స్పేస్‌ఎక్స్‌కు 5.9 బిలియన్ డాలర్ల లాంచ్ సర్వీస్ కాంట్రాక్టుతో సహా బిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందాలున్నాయి.

"మన జాతీయ భద్రతా వ్యవస్థకు మూలస్తంభంగా ఉన్న స్పేస్‌ఎక్స్ లాంటి సంస్థపై చైనా వంటి ప్రత్యర్థి దేశం పెత్తనం చెలాయించగలిగే అవకాశం ఉండడం ప్రమాదకరం" అని వారు స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో కంపెనీకి సంబంధించిన రహస్య సమాచారాన్ని చైనా పెట్టుబడిదారులు తెలుసుకుని, అమెరికా జాతీయ భద్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందని సెనేటర్లు హెచ్చరించారు. స్పేస్‌ఎక్స్‌లో చైనా ప్రభావంపై తాము లేవనెత్తిన ప్రశ్నలకు, ఈ భద్రతాపరమైన ఆందోళనలను పరిష్కరించడానికి డీఓడీ ఎలాంటి చర్యలు తీసుకోబోతోందో ఫిబ్రవరి 18లోగా తెలియజేయాలని వారు తమ లేఖలో కోరారు.

# సోషల్ మీడియాలో విద్యార్థుల గోడు... కదిలిపోయిన పవన్ కల్యాణ్

చేసిన విన్నపం ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను కదిలించింది. సామాజిక మాధ్యమాల్లోని ఒక వీడియోలో విద్యార్థులు పడుతున్న వేదనను చూసి చలించిపోయిన ఆయన, తక్షణమే స్పందించి గంటల వ్యవధిలోనే రోడ్డు నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటన శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, కొండాపురం మండల పరిధిలోని గజ్జులవారిపల్లి గ్రామ విద్యార్థులు పాఠశాలకు వెళ్లేందుకు సరైన రోడ్డు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం పడితే ఆ దారి బురదమయంగా మారి నరకాన్ని తలపిస్తోంది. తమ గోడును ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలనే ఉద్దేశంతో, వారు తమ కష్టాలను వివరిస్తూ ఒక వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. శుక్రవారం ఈ వీడియో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి వచ్చింది. విద్యార్థుల ఆవేదనను చూసిన ఆయన వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డు నిర్మాణానికి అవసరమైన అంచనాలను వెంటనే రూపొందించి, పనులు ప్రారంభించాలని ఆదేశించారు.

పవన్ కల్యాణ్ ఆదేశాలతో అధికారులు వెంటనే స్పందించి 1.6 కిలోమీటర్ల రోడ్డు నిర్మాణానికి రూ. 86 లక్షలతో అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేశారు. ఈ రోడ్డు నిర్మాణం పూర్తయితే గజ్జులవారిపల్లి విద్యార్థులకే కాకుండా, పొలాలకు వెళ్లే రైతులకు కూడా ఏళ్లనాటి కష్టాలు తీరనున్నాయి.ఇదిలా ఉండగా, కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఉదయగిరి నియోజకవర్గంలో ఇప్పటికే 'పల్లెపండగ 1.0, 2.0', సాస్కి నిధులతో కలిపి సుమారు రూ. 55 కోట్లతో రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు. ఈ ప్రాజెక్టుల కింద మొత్తం 641 రోడ్ల నిర్మాణం జరుగుతోంది. వీటికి అదనంగా, తాజాగా విద్యార్థుల అభ్యర్థన మేరకు గజ్జులవారిపల్లి రోడ్డును ప్రత్యేకంగా మంజూరు చేయడం గమనార్హం.

# పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించొద్దు

బడ్జెట్ లో ఏపీకి పెద్ద పీట వేశారని... రాష్ట్ర రైల్వే ప్రాజెక్టులకు రూ. 10,134 కోట్లు, అమరావతి కోసం రూ. 1,120 కోట్లు కేంద్ర బడ్జెట్ లో కేటాయించారని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. కేంద్రం సాయంతో ఏపీలోని కూటమి ప్రభుత్వం అనేక ప్రాజెక్టులను సాధించిందని చెప్పారు. పోలవరం ప్రాజెక్టును సకాలంలో పూర్తి చేసేందుకు కేంద్రం నిధులు ఇస్తోందని తెలిపారు. రాష్ట్రానికి బలమైన పునాదులు పడుతున్నాయని... పండ్లు కాసే సమయంలో రాష్ట్రాన్ని కసాయికి అప్పగించవద్దని పరోక్ష వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ నాయకత్వంలో భారత్ ఎన్నో విజయాలను సాధిస్తోందని రామ్మోహన్ నాయుడు కొనియాడారు. వికసిత్ భారత్ దిశగా దేశం దూసుకుపోతోందని అన్నారు. రాజకీయాలను పక్కన పెట్టి, దేశ శ్రేయస్సే లక్ష్యంగా మోదీ ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశ ప్రజల భవిష్యత్తును నిర్దేశించే విధంగా, యువత ఆశయాలు, ఆకాంక్షలు ప్రతిబింబించేలా కేంద్ర బడ్జెట్ ఉందని అన్నారు. రాబోయే 20 ఏళ్ల పాటు 7 శాతం వృద్ధి రేటు కొనసాగేలా నిర్మలా సీతారామన్ బడ్జెట్ ను రూపొందించారని కితాబునిచ్చారు.

# 'అరెస్ట్' ఎప్పుడు చేయాలంటే.. పోలీసులకు సుప్రీం కీలక ఆదేశాలు

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు సతేందర్ కుమార్ అంటిల్ వర్సెస్ సీబీఐ కేసులో జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్ కే సింగ్ ల ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. వ్యక్తిగత స్వేచ్ఛతో కూడుకున్న విషయం కాబట్టి అరెస్టుల విషయంలో జాగ్రత్తగా వ్యవహరించాలని పోలీసులకు సూచించింది.

**సుప్రీం బెంచ్ సూచనలు ఇవే..**

క్రిమినల్ కేసుల్లో ఫిర్యాదు అందిన తర్వాత రెండు దశల పద్ధతిని పాటించాలని దర్యాప్తు అధికారికి కోర్టు సూచించింది. సదరు కేసు విచారణలో అరెస్టు తప్పనిసరా? కాదా?.. బీఎన్ఎస్ సెక్షన్ 33, సెక్షన్ 35 ప్రకారం అరెస్టు చెయ్యవచ్చా? లేదా? అనేది వ్యక్తిగతంగా నిర్ణయించుకోవాలని పేర్కొంది. ఈ ప్రక్రియలో ఆర్టికల్ 21 (వ్యక్తిగత స్వేచ్ఛ, జీవించే హక్కు) ప్రకారం పౌరులకు కల్పించిన హక్కుల ఉల్లంఘన జరగకుండా జాగ్రత్తపడాలని హెచ్చరించింది. ఆరోపణలు ఎదుర్కొంటున్న నిందితులు అందరికీ ఈ నిబంధన వర్తిస్తుందని; నిందితుడు, సహ నిందితుడనే భేదాలు ఏవీ మినహాయింపు కాదని స్పష్టం చేసింది. అదే సమయంలో అరెస్టుకు సంబంధించి పోలీసులకు చట్టం కల్పించిన మినహాయింపులనూ సుప్రీంకోర్టు ప్రస్తావించింది. బీఎన్ఎస్ సెక్షన్ 35(1)(బి) ప్రకారం.. ఎలాంటి వారెంట్ లేకున్నా పోలీసులు అరెస్టు చేయవచ్చనే నిబంధనను ప్రస్తావిస్తూ.. ఈ రూల్ ప్రకారం వారెంట్ లేకుండా ఎవరినైనా అరెస్టు చేయొచ్చని భావించరాదని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది.

# క్వాంటమ్ విప్లవానికి మనదే నాయకత్వం.. ఇది చారిత్రక ఘట్టం

- మొదటి పేజి తరువాయి

వాజ్‌పేయి గారు టెలికమ్యూనికేషన్ రంగంలో సంస్కరణలు తీసుకురావడం, నేను హైటెక్ సిటీని ప్రారంభించడం దేశ ఐటీ రంగంలో గేమ్ ఛేంజర్‌గా నిలిచాయి. ఆనాడు వాజ్‌పేయి గారు హైటెక్ సిటీని ప్రారంభిస్తే, నేడు క్వాంటమ్ వ్యాలీకి ఇక్కడ పునాది పడింది. ఇది దేశానికే మరో గేమ్ ఛేంజర్ అవుతుంది. ఈ చరిత్రలో మనమందరం భాగస్వాములం" అని ఉద్వేగంగా ప్రసంగించారు.తుళ్లూరు మండలం ఉద్దండరాయుని పాలెంలో ప్రభుత్వం కేటాయించిన 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ క్వాంటమ్ వ్యాలీ రూపుదిద్దుకోనుంది. ఇది కేవలం ఒక భవనం కాదు, క్వాంటమ్ కంప్యూటింగ్, క్వాంటమ్ కమ్యూనికేషన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ, రక్షణ, ఆరోగ్యం, ఆర్థిక రంగాల్లో పరిశోధనలు, ఆవిష్కరణలకు కేంద్రంగా మారనుంది. వచ్చే 40 ఏళ్ల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఈ ప్రాజెక్టును చేపట్టినట్లు సీఎం స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా ఐబీఎం, టీసీఎస్, ఎల్ అండ్ టీ వంటి దిగ్గజ సంస్థల ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడుతూ, "భారతదేశంలోనే తొలి 133 క్యూబిట్ క్వాంటమ్ కంప్యూటర్‌ను అమరావతికి తీసుకురావాలి. ఒకటి రెండు నెలల్లో ఒప్పందాలు పూర్తిచేసి, ఈ ఏడాది చివరికల్లా తొలి క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇక్కడ ఏర్పాటు చేయాలి. ఏప్రిల్ 14 నాటికి మరో రెండు క్వాంటమ్ సెంటర్లను కూడా ప్రారంభిస్తాం"

అని లక్ష్యాలను నిర్దేశించారు. 2030 నాటికి రాష్ట్రంలో 2.5 లక్షల మంది క్వాంటమ్ నిపుణులను తయారు చేయాలనే బృహత్ ప్రణాళికను ఆయన వివరించారు.

అమరావతిని ప్రపంచ పటంలో నిలపాలన్న తన సంకల్పానికి బలం చేకూరుస్తూ, మైక్రోసాఫ్ట్ వ్యవస్థాపకుడు బిల్ గేట్స్ ఈ నెల 16న అమరావతికి రానున్నట్లు చంద్రబాబు ప్రకటించడం సభలో హర్షాతిరేకాలు రేపింది. దేశంలోని ఐటీ నిపుణుల్లో 35 శాతం మంది తెలుగువారేనని గుర్తు చేస్తూ, వారి ప్రతిభను రాష్ట్ర భవిష్యత్తు కోసం వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని

చంద్రశేఖర్, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్, మంత్రులు నారాయణ, కందుల దుర్గేశ్, ఐఐటీ, టీసీఎస్, ఐబీఎం, ఎల్ అండ్ టీ సంస్థల ఉన్నతాధికారులు, విద్యావేత్తలు, విద్యార్థులు పాల్గొన్నారు. ఈ శంకుస్థాపన, ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ సాంకేతిక హబ్‌గా మార్చే ప్రయాణంలో ఒక మైలురాయిగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.

# క్వాంటం వ్యాలీ ఏర్పా టు లో లోకేష్ పాత్ర కీలకం. జగదీశ్వరి.



**పోలవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7.** దేశంలోనే మొట్టమొదటి క్వాంటం వ్యాలీ ఆంధ్రలో ఏర్పాటు చేయడం అభినందనీయం అని రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ నిర్వాహకురాలు కొవ్వాసు జగదీశ్వరి అన్నారు. శనివారం ఆమె స్థానిక క్యాంప్ కార్యాలయం నుండి పత్రిక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ కృషితో అమరావతిలో క్వాంటం వ్యాలీ నిర్మాణం నూతన అధ్యాయానికి శ్రీకారంఅన్నారు. ఆ నిర్మాణం ద్వారా అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ మ్యాప్ లో నిలబెట్టిన ఘనత మంత్రి లోకేష్ కి దక్కుతుందన్నారు. ప్రపంచస్థాయి ఐటి దిగ్గజ సంస్థలను తన మేధాశక్తితో ఎంతో చాకచక్యంగా ఒప్పించి అమరావతికి రప్పించారన్నారు. దీనివల్ల భవిష్యత్తులో ఆంధ్ర రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి, ఉద్యోగ కల్పన ఉంటుందన్నారు. హైటెక్ సిటీ తో ఐటి విప్లవాన్ని తీసుకొచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విజనరీలో రాష్ట్రం సాంకేతిక రంగాలలో దిన దిన అభివృద్ధి చెందుతుంది అన్నారు. క్వాంటం వ్యాలీ నిర్మాణం భవిష్యత్తులోనవ్యాంధ్ర సరికొత్త చరిత్రను నెలకొల్పబోతుందన్నారు. సమాజ అభివృద్ధిలో యువవిత పాత్ర కీలకమని, అటువంటి యువతకు ఉపాధి ఉద్యోగ కల్పన కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని జగదీశ్వరి పేర్కొన్నారు.

పెన్ పవర్
పోలవరం - ఏలూరు
తూర్పుగోదావరి - పశ్చిమ గోదావరి

# శివరాత్రి ఏర్పాట్లు 2027 గోదావరి పుష్కరాలకు తొలి ట్రైల్ రన్




✸ కలెక్టర్ కీర్తి చేకూరి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7**
రానున్న 2027 మహా గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని, జిల్లాలోని అన్ని స్నాన ఘాట్లు ఒకే ఆకృతిలో, ఉండేలా మోడల్ ఘాట్ నమూనాను సిద్ధం చేయాలని కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులను ఆదేశించారు. శనివారం ధవళేశ్వరం నుంచి సరస్వతి ఘాట్, మార్కండేయ ఘాట్, పుష్కర్ ఘాట్ వరకు పలు ఘాట్లను ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనాలతో కలిసి క్షేత్ర స్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, పుష్కర పుణ్య స్నానాలు ఏర్పాట్ల నేపథ్యంలో భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. శివరాత్రి సందర్భంగా చేపడుతున్న ఏర్పాట్లను పుష్కరాలకు తొలి ట్రైల్ రన్‌గా భావించి, భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ముందుగా ఒక మోడల్ ఘాట్‌ను నిర్మించి, అదే డిజైన్‌ను మిగిలిన ఘాట్లకు అనుసరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో నగరపాలక సంస్థ, ఇరిగేషన్ శాఖలు సమన్వయంతో మోడల్ ఘాట్ నమూనాను తక్షణమే సిద్ధం చేయాలన్నారు. భక్తుల భద్రత, సౌకర్యాల దృష్ట్యా క్రౌడ్ మేనేజ్‌మెంట్ ప్లాన్ను పకడ్బందీగా రూపొందించాలని ఎస్పీ డి. నరసింహ కిషోర్ అధికారులను ఆదేశించారు. స్నాన ఘాట్ల వద్ద రాకపోకలకు సంబంధించి రూట్ మేనేజ్‌మెంట్ అమలు చేయాలని, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను స్పష్టంగా ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఘాట్ల అభివృద్ధిపై మున్సిపల్ కమిషనర్ రాహుల్ మీనా ప్రాథమిక కార్యాచరణను వివరించారు. ఘాట్ల వెంబడి పారిశుద్ధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, గ్రీనరీ అభివృద్ధి చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంసి కమిషనర్ రాహుల్ మీనా, ఎస్పీ డి. నరసింహ కిషోర్, ఇరిగేషన్ ఎస్ఈ కె. గోపినాథ్, టూరిజం ఆర్డీ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, పోలీసు, రెవెన్యూ, ఇరిగేషన్, నగరపాలక సంస్థ, టూరిజం శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఎటపాక మండలంలో అక్రమ తెల్లరాయి తవ్వకాలు జోరుగా సాగుతున్నాయి.





**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7:**పోలవరం జిల్లా ఎటపాక మండలం అక్రమ తవ్వకాలకు అడ్డాగా మారింది. అనుమతులు లేకుండా కొందరు అక్రమార్కులు తెల్లరాయి కోసం భారీ యంత్రాలను వినియోగిస్తూ ఇష్టానుసారంగా తవ్వకాలు నిర్వహిస్తున్నారు. కొండలు, గుట్టలతో పాటు పంట పొలాలను సైతం నాశనం చేస్తూ భూగర్భాన్ని చీల్చి తెల్లరాయిని వెలికితీసి తరలిస్తున్నట్లు సమాచారం. మండల పరిధిలోని పండువారుగూడెం పరిసర ప్రాంతాల్లో ఈ అక్రమ తవ్వకాలు ఎక్కువగా జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని అక్రమ తవ్వకాల్లో పాల్గొన్న కొందరిని అడ్డుకొని విచారణ చేపట్టారు. స్థానిక గిరిజనులకు డబ్బుల ఆశ చూపించి వారి భూముల్లో అక్రమంగా తవ్వకాలు సాగిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ కార్యకలాపాల వల్ల పర్యావరణానికి తీవ్ర నష్టం జరుగుతోందని, వెంటనే తవ్వకాలను నిలిపివేయాలని వారు కోరుతున్నారు.

# గాడాల లో యూనియన్ బ్యాంకు కొత్త శాఖ ప్రారంభం



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**
గాడాల గ్రామంలో యూనియన్ బ్యాంక్ నూతన శాఖ శనివారం ప్రారంభమైంది. బ్యాంకు జోనల్ హెడ్ టి వాసప్ప ప్రారంభించారు. ఈ సందర్భంగా వాసప్ప మాట్లాడుతూ, తమ బ్యాంకులో వ్యవసాయ, బంగారు ఆభరణాలు, గృహ విద్య రుణాలు అందజేస్తామ న్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు రీజినల్ హెడ్ విశ్వేశ్వరరావు బ్యాంకు మేనేజర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మంత్రికి స్వాగతం పలికిన జి ఆర్ కె



**జీలుగుమిల్లి, పెన్ పవర్ ,ఫిబ్రవరి 7 ;** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కి ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్ శనివారం ఐ ఎస్ జగన్నాధపురం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయమునందు స్వాగతం పలికి ,పూలమాలవేసి ఘనంగా సన్మానించారు. మంత్రాలయ దర్శనం తో ప్రత్యేక పూజలు, ఘనంగా నిర్వహించారు. శివరాత్రి ఉత్సవాలు జయప్రదం చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పచ్చమట్ల ధర్మరాజు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు కోటికలపూడి గోవిందరావు, విజయవాడ రీజియన్ ఆర్టీసీ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంతో చెలగాటం సహించేది లేదు



✸ మెనూ పాటించకపోతే చర్యలు తప్పవు
✸ విద్యార్థులతో కలసి క్రింద కూర్చుని వివరాలు ఆడుతున్న ఎమ్మెల్యే
✸ ఆహారతనిఖీ, తాగునీటి పరీక్షలు చేయించాలన్న ఎమ్మెల్యే

**గంగవరం /మారేడుమిల్లి, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**ప్రభుత్వ పాఠశాలల్లో, వసతిగృహాల్లో విద్యార్థులకు అందించే ఆహారంలో ఎలాంటి రాజీ పడ్డా చర్యలు తప్పవని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి ఆగ్రహం వ్యక్తం చేశారు. మారేడుమిల్లి మండలం దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆహార కలుషితం పై శనివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థులతో కలసి క్రింద కూర్చుని పాఠశాలలో పెడుతున్న ఆహార పదార్థాలు వివరాలు, త్రాగునీటి పై ఆరా తీశారు. ఇదే క్రమంలో ఈ రోజు పెట్టిన ఇడ్లీ పిండి, పాలు ప్యాకెట్ లను పరిశీలించారు. వసతి గృహాల్లో ఉన్న వసతులపై ఆరా తీసి మెరుగుపరచాలని కోరారు. కాచి చల్లార్చిన మంచి నీటిని అందించాలని కోరారు.వంట సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. పాఠశాల సిబ్బంది పై మండిపడ్డారు. పాఠశాలలో ఎంత మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. ఎంతమందికి ఫుడ్ పాయిజన్ అయ్యింది తదితర వివరాలు అడిగారు. విద్యార్థుల విషయంలో ఎలాంటి లోపాలకు పాల్పడా చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం పెట్టకుండా ఇష్టారాజ్యంగా వ్యవహారాలు చేస్తే సహించేది లేదని వార్డెన్ గణపతికి తెలిపారు. ఇంత జరుగుతున్నా ప్రధానోపాధ్యాయులు అందుబాటులో లేకపోవడంపై మండిపడ్డారు. అలాగే ఆహార పదార్థాలు తనిఖీలు మరియు త్రాగునీటిపై పరీక్షలు చేయించాలని వైద్య సిబ్బంది, ఆర్డబ్ల్యూఎస్ అధికారులకు ఆదేశించారు. గ్రామస్తులు మాట్లాడుతూ వసతి గృహంలోకి పర్యవేక్షణకు సమయం అవకాశం ఇవ్వకుండా పాఠశాల సిబ్బంది వ్యవహరిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనితో స్పందించిన ఆమె సిబ్బందితో మాట్లాడి గ్రామస్తులతో మంచిగా ఉండాలన్నారు. విద్యార్థులకు ఎలాంటి అనారోగ్య పరిస్థుతులు ఉన్నా వెంటనే స్పందించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవన్నారు. పాఠశాలలో ఉన్న సమస్యలపై స్పందించిన ఆమె త్వరితగతిన పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. అలాగే మారేడుమిల్లి ఆసుపత్రిలో అస్వస్థతకులోనై చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించి వైద్యులకు పలు సూచనలు చేశారు. అవసరం అయితే మెరుగైన వైద్య సేవలు కొరకు జిల్లా స్థాయి ఆసుపత్రులకు లేదా ప్రయివేట్ ఆసుపత్రులకు రిఫర్ చేయాలని సూచించారు .ఈ కార్యక్రమంలో రాష్ట్ర దూదేకుల కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ సుభానీ, మండల పార్టీ అధ్యక్షులు గురుకు శేష కుమార్, జనసేన మండల పార్టీ అధ్యక్షులు మల్లా దుర్గ ప్రసాద్,మండల ప్రధాన కార్యదర్శి కర్రి సన్యాసిరెడ్డి , మాజీ మండలపార్టీ అధ్యక్షులు భీశెట్టి అప్పాజీ, యూనిట్ ఇంచార్జి అందాల సూర్యనారాయణ రెడ్డి , మాజీ మండల ప్రధాన కార్యదర్శి పోడియం శ్రీనుబాబు , మాజీ సర్పంచ్ పొడియం కన్నపు దొర , మాజీ ఎంపీటీసీ కానెం విజయలక్ష్మి ,మాజీ మండలపార్టీ అధ్యక్షులు పుచ్చల గురునాథరెడ్డి , జనసేన నాయకులు జి .ధర్మ తేజ , గ్రామ కమిటీ అధ్యక్షులు రేవుల జానకి రెడ్డి, కురసం బాపన్న దొర , మాజీ గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి మడకంవెంకటేశ్వర్లు , మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పి ఏసుబాబు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# గోదావరి నదిలో మూడు డ్రెడ్జింగ్ బోట్లు సీజ్, కేసు నమోదు



**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7** :రాజమహేంద్రవరం రూరల్ మండలం, కాతేరు గ్రామ పరిధిలో గల డిసిల్టేషన్ ఇసుక రీచ్ వద్ద జిల్లా గనులు భూగర్భ శాఖ అధికారి, రాజమహేంద్రవరం వారి ఆధ్వర్యంలో గనులు శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, ఇరిగేషన్ శాఖ అధికారులు మరియు స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి శనివారం సంయుక్త తనిఖీలు నిర్వహించారు.తనిఖీల సందర్భంగా కాతేరు డిసిల్టేషన్ ఇసుక రీచ్ ఒడ్డున మూడు డ్రెడ్జింగ్ బోట్లు వాటి సమీపంలో రెండు ఇసుక గుట్టలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. డ్రెడ్జింగ్ బోట్లలో ఇసుక ఆనవాళ్లు లభించడంతో, అవి గోదావరి నదిలో నియమ విరుద్ధంగా ఇసుక త్రవ్వకాలలో పాల్గొన్నట్లు అధికారులు నిర్ధారించారు.

నియమాలను ఉల్లంఘిస్తూ డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక త్రవ్వకాలకు పాల్పడినట్లు నిర్ధారించిన మూడు డ్రెడ్జింగ్ బోట్లను సీజ్ చేసి, వాటిపై కేసు నమోదు చేయుటకు ఇరిగేషన్ శాఖ అధికారులకు అప్పగించడం జరిగింది. అదేవిధంగా డ్రెడ్జింగ్ బోట్ల సమీపంలో ఉన్న ఇసుక గుట్టలను కొలతలు వేసి, అవి సుమారు 642 టన్నుల పరిమాణంలో ఉన్నట్లు నిర్ధారించి, సదరు ఇసుక గుట్టలను సీజ్ చేసి తదుపరి చర్యలు తీసుకునే వరకు స్థానిక రెవెన్యూ అధికారుల సంరక్షణకు అప్పగించారు. భవిష్యత్తులో కాతేరు డిసిల్టేషన్ ఇసుక రీచ్‌లో నియమ విరుద్ధంగా డ్రెడ్జింగ్ ద్వారా ఇసుక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులను అధికారులు హెచ్చరించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాత్రమే ఇసుక కార్యకలాపాలు నిర్వహించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా గనులు భూగర్భ అధికారి డి. ఫణి భూషణ్ రెడ్డి, అసిస్టెంట్ జియాలజిస్ట్
జి. విఘ్నేశ్వరుడు, గనులు భూగర్భ శాఖ క్షేత్రస్థాయి సిబ్బంది, ఇరిగేషన్ శాఖ అధికారులు, స్థానిక రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు తక్షణ వైద్యసేవలు అందించాలి





**జాయింట్ కలెక్టర్ స్మరణ్ రాజ్ సమీక్ష**

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్ ఫిబ్రవరి 7 :**జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఎవరైనా అనారోగ్యానికి గురైన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు తరలించి మెరుగైన వైద్యసేవలు అందించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ సంబంధిత వైద్యాధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రుక్మాండయ్య, పోలవరం జిల్లా డీఎం అండ్ హెచ్ఓ పి. సరితతో కలిసి 19 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనారోగ్యంతో బాధపడుతున్న విద్యార్థులకు ఎప్పటికప్పుడు మెరుగైన వైద్యసేవలు అందించే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలలలో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని, యాక్షన్ ప్లాన్ ప్రకారం వైద్యాధికారులు పాఠశాలలను తరచూ పర్యవేక్షించాలని తెలిపారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధిగ్రస్తులైన విద్యార్థులకు ప్రత్యేక వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. రంపచోడవరం డివిజన్ పరిధిలోని ఆశ్రమ పాఠశాలలలో సికిల్ సెల్ ఎనీమియా బాధితుల సంఖ్యపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆశ్రమ పాఠశాలలలోని సిక్ రూమ్‌లలో ఉన్న విద్యార్థులను ఒక ఉపాధ్యాయుడు, 'ముస్తాబు' ప్రోగ్రాం ద్వారా నియమితులైన లీడర్లు పర్యవేక్షించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు మరియు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో అవసరమైన వైద్య పరికరాలు పూర్తిస్థాయిలో ఉన్నాయో లేదో తెలుసుకున్నారు. డివిజన్ పరిధిలో పనిచేస్తున్న ఆశా వర్కర్ల సంఖ్యపై కూడా ఆరా తీశారు. విద్యార్థుల్లో ఎవరైనా జ్వరంతో బాధపడితే వెంటనే ఆసుపత్రులకు తరలించి మలేరియా పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి విద్యార్థి బ్లడ్ గ్రూప్‌ను నిర్ధారించి ప్రత్యేక రిజిస్టర్ నిర్వహించాలని సూచించారు. గిరిజన సంక్షేమ శాఖ అధికారులు, వైద్యాధికారులు సమన్వయంతో ఆశ్రమ పాఠశాలలను క్రమం తప్పకుండా మానిటరింగ్ చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో ఆశ్రమ పాఠశాలలలో విద్యార్థులకు అందిస్తున్న వైద్యసేవలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు సమర్పించారు. ఈ సమావేశంలో సహాయక గిరిజన సంక్షేమ శాఖ అధికారులు కృష్ణమోహన్, జె. శంభుడు, వైద్యాధికారులు కెవిన్, శ్వేత, నితిన్ కుమార్, దినేష్ కుమార్, వినోద్ కుమార్, బాలాజీ, ఎం.పి.హెచ్.ఓ ప్రసాద్, బి. మార్గదర్శి తదితరులు పాల్గొన్నారు.

# మావోయిస్టు భారీ స్మారక స్తూపం ధ్వంసం





**చింతూరు పెన్ పవర్, ఫిబ్రవరి 7:**ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో మావోయిస్టుల కార్యకలాపాలపై భద్రతా బలగాలు ఉక్కుపాదం మోపుతున్నాయి. నారాయణ్‌పూర్ జిల్లా కొహక మేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పరేస్‌గావ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులు నిర్మించిన భారీ స్మారక స్తూపాన్ని భద్రతా బలగాలు ధ్వంసం చేశాయి. ఇదే క్రమంలో ఛత్తీస్‌గఢ్ సుకుమా జిల్లా తూమల్‌పాడ్ అటవీ ప్రాంతంలో మావోయిస్టులకు సంబంధించిన మరో భారీ స్మారక స్తూపాన్ని సీఆర్‌పీఎఫ్ 50వ బెటాలియన్‌కు చెందిన బలగాలు పూర్తిగా ధ్వంసం చేశాయి. ఇప్పటికే అబూజ్‌మడ్ ప్రాంతాన్ని పూర్తిగా స్వాధీనం చేసుకున్న భద్రతా బలగాలు, మావోయిస్టుల ఆనవాళ్లను పూర్తిగా తొలగించే దిశగా చర్యలు చేపడుతున్నాయి. మావోయిస్టుల నిర్మూలనతో పాటు మారుమూల ప్రాంతాల అభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి రహదారుల నిర్మాణం చేపట్టి రవాణా వ్యవస్థను మెరుగుపరుస్తోంది. దీంతో ప్రజలకు మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తున్నాయని అధికారులు తెలిపారు.

# కందుల దుర్గేశ్‌ను కలిసిన జనసేన నాయకులు



**చింతూరు పెన్ పవర్ ఫిబ్రవరి 7:**ఎటపాక మండలానికి చెందిన జనసేన నాయకులు శనివారం ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్ నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలానికి సంబంధించిన పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. 41.5 కాంటూర్ పరిధిలో ఎటపాక మండలాన్ని పోలవరం ముంపు జాబితాలో చేర్చాలని, అలాగే మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మారాసు గంగాధర్, ఉపాధ్యక్షులు గోవింద్ వెంకట్, యూత్ అధ్యక్షులు కొమ్ము వెంకటేష్, పెనుబల్లి తిరుపతయ్య, సుధిపాక రామకృష్ణ, కొట్టే కృష్ణ, వీ.ఆర్.పురం మండల అధ్యక్షులు సాయి కృష్ణ, మండల కార్యదర్శి బాగుల అంజనరావుతో పాటు ఇతర జనసేన నాయకులు పాల్గొన్నారు.

# జలాశయాల్లో చేప పిల్లల వదిలివేత
# గిరిజన మత్స్యకారులకు జీవనోపాధి బాట



**జిల్లా జాయింట్ కలెక్టర్ స్మరణ రాజ్**

**రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7 :** పోలవరం జిల్లాలోని మత్స్య సహకార సంఘాలు ఆర్థికంగా అభివృద్ధి చెందేలా సంఘాల ఆధీనంలో ఉన్న జలాశయాల్లో చేపల పెంపకానికి తగు చర్యలు చేపట్టినట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ తెలిపారు. శనివారం రంపచోడవరం మండలం భూపతిపాలెం ప్రాజెక్టులో చేప పిల్లలను జలాశయంలో వదిలి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంపచోడవరం డివిజన్ పరిధిలోని భూపతిపాలెం, వట్టిగడ్డ, మద్ది గడ్డ, దెయ్యాలగుమ్మి, గింజర్తి జలాశయాల్లో చేపల పెంపకానికి రూ.1.80 లక్షల వ్యయంతో సుమారు 0.60 లక్షల చేప పిల్లలను వదిలినట్లు తెలిపారు. ఈ ఐదు జలాశయాల్లో చేపలు పట్టుకుని గిరిజన మత్స్యకార సంఘాల సభ్యులు స్థిరమైన జీవనోపాధి పొందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. పోలవరం జిల్లాలో మత్స్య సంపద అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలవరం జిల్లా మత్స్యశాఖ అధికారి ఎస్.కె. దిల్షాద్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి ఎ. అనిల్ కుమార్, జిల్లా మత్స్య సహకార సంఘాల అధ్యక్షులు బి. రంగారావు, సీడ్ స్టాకింగ్ కమిటీ సభ్యులు పి. సంతోష్ కుమార్, వి.ఎఫ్.ఏలు తదితరులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ఫలితాలలో రాష్ట్ర టాక్స్ సహాయ కమిషనర్ గా ఎన్నికైన జాలాది రమ్యశ్రీ అభినందనలు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 07.**అత్యంత సాధారణ కుటుంబం లో జన్మించి , ఎటువంటి గడ్డు పరిస్థితులు ఎదురైనా సరే అకుంఠిత దీక్ష, అంకితభావం, లక్ష్యసాధనతో, దృఢ చిత్తం ఉంటే ఎటువంటి అద్భుతాలు సృష్టించ వచ్చో రమ్య శ్రీ నిరూపించారని తాడేపల్లిగూడెం మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎం యేసుబాబు గారు తెలియజేశారు. ఈరోజు పెద తాడేపల్లి గ్రామానికి చెందిన జాలాది రమ్యశ్రీ ఇటీవల విడుదలైన గ్రూప్-1 ఫలితాలలో చక్కటి ప్రతిభ కనబరిచి రాష్ట్ర టాక్స్ సహాయ కమిషనర్ గా ఎన్నికైన సందర్భంగా ఆమె నివాసానికి కి వెళ్లి అభినందనలు తెలియజేశారు. పెదతాడేపల్లి సర్పంచ్ పోతుల అన్నవరం పెద్దలు ఆమెను అభినందించారు, తండ్రి కుటుంబరావు, తల్లి సునీత ల ప్రోత్సాహంతోనే నేను ఈ స్థాయికి ఎదిగినట్టు రమ్యశ్రీ కమిషనర్ కి తెలియజేశారు. రమ్యశ్రీ కి అభినందనలు తెలియజేసిన వారిలో అదే గ్రామానికి చెందిన ప్రస్తుతం తాడేపల్లిగూడెం పట్టణ ప్రణాళిక అధికారిగా పని చేస్తున్న వీరమల్లు జగదీశ్వర రావు మరియు వారి సిబ్బంది పాల్గొన్నారు.

# అమ్మవారి వార్షికోత్సవం రథోత్సవం ఘనంగా నిర్వహణ



**చింతూరు, పెన్ పవర్ ఫిబ్రవరి 7:**గ్రామ దేవత అమ్మవారి వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం గ్రామంలో రథోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించగా, అమ్మవారిని రథంపై ఊరేగింపుగా గ్రామ వీధుల్లో తీసుకెళ్లారు. రథోత్సవంలో మహిళలు, యువకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి హారతులు ఇచ్చారు. పూజారులు మంత్రోచ్చారణలతో పూజలు నిర్వహించగా, డప్పులు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు కొనసాగింది. అమ్మవారి దర్శనంతో గ్రామ ప్రజలకు శుభాలు కలగాలని భక్తులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం సందర్భంగా అన్నదానం ఏర్పాటు చేయగా, గ్రామస్తులు స్వచ్ఛందంగా సహకరించారు. వార్షికోత్సవం విజయవంతంగా ముగియడంతో గ్రామంలో భక్తి వాతావరణం నెలకొంది.




# నారాయణపురం అరవింద శతజయంతి డిగ్రీ కళాశాలలో

**పబ్లిక్ హెల్త్ & హెల్త్ డేటా అనాలిటిక్స్ పై 10 రోజుల ఆన్లైన్ కోర్సు**



**పెన్ పవర్ ఉంగుటూరు । ఫిబ్రవరి 07:**నారాయణపురంలోని అరవింద శతజయంతి డిగ్రీ కళాశాలలో పబ్లిక్ హెల్త్ అండ్ హెల్త్ డేటా అనాలిటిక్స్ అంశంపై పది రోజుల పాటు ఆన్లైన్ కోర్సు విజయవంతంగా నిర్వహించారు.
ఈ కోర్సును బ్లాక్ బాక్స్ ఎడ్యుకేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.
ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ ఆర్. భూషణరావు మాట్లాడుతూ,
వ్యాధులకు సంబంధించిన డేటాను ఎలా సేకరించాలి,
ఆక్వాకల్చర్, అగ్రికల్చర్, మానవ ఆరోగ్యానికి సంబంధించిన డేటాను శాస్త్రీయంగా ఎలా నమోదు చేయాలి అనే అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.
అదేవిధంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. వసుధ మాట్లాడుతూ,
వ్యాధులు రాకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు,
ఆరోగ్యానికి సంబంధించిన డేటాను ఎలా స్వీకరించాలి,
ప్రస్తుత తరం అవసరాలకు అనుగుణంగా కంప్యూటర్ ద్వారా డేటాను ఎలా సేకరించాలి అనే అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.
ఈ కార్యక్రమం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా నిలిచిందని కళాశాల అధ్యాపకులు తెలిపారు.

# రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు , మర్యాద పూర్వకంగా కలిసినడా వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా కె. ధనుంజయరావు



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 07.**ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ని, అమరావతి సచివాలయంలో,
డా వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డా కె. ధనుంజయరావు మర్యాద పూర్వకం గా కలసి పుష్పగుచ్ఛం అందచేసి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "రాయలసీమ ప్రాంతాన్ని హార్టికల్చర్ హబ్ గా మార్చాలనే ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా, ఉద్యాన విశ్వవిద్యాలయం పని చేయాలని",ఆదేశించారు.
ప్రతీ నెలా సమీక్షా సమావేశాలకు హాజరై, పురోగతిని తెలియచేయాలని, ఆదేశించారు.
ఉపకులపతి వెంట ఉద్యాన విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డా. ఏం. మాధవి, అధికారులు పాల్గొన్నారు

## స్వర్ణ గంగవరం సచివాలయాన్ని సందర్శించిన డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర

* ఐ వి ఆర్ ఎస్ కాల్స్, యు ఎస్ ఎఫ్ సర్వే, ఆధార్ సేవలపై ప్రత్యేక దృష్టి





**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7 :**స్వర్ణ గంగవరం గ్రామ సచివాలయాన్ని డిప్యూటీ ఎంపీడీవో గోపన్నదొర శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా సచివాలయంలో జరుగుతున్న పరిపాలనా పనితీరును సమీక్షించారు. ముఖ్యంగా ఐ వి ఆర్ ఎస్ కాల్స్ పై సిబ్బందికి అవగాహన కల్పించి, ప్రజలకు సమయానుకూలంగా స్పందించాలని సూచించారు.అదేవిధంగా యు ఎస్ ఎఫ్ సర్వే పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఆధార్ కేంద్రంలో అందిస్తున్న సేవలను మరింత విస్తరించి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో సేవలు అందించాలని సిబ్బందిని దిశానిర్దేశం చేశారు.సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టాలని ఆయన పేర్కొన్నారు.

## మత్స్య సంపద తో అదనపు ఆదాయం

* చెరువుల అభివృద్ధికి సహకారం అందిస్తాం
* 60,000 చేప పిల్లలు విడుదల చేసిన ఎమ్మెల్యే శిరీషాదేవి
* ఎమ్మెల్యే రాష్ట్ర, ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి



**గంగవరం/రాజవొమ్మంగి, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**
చేపల పెంపకం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చునని రంపచోడవరం ఎమ్మెల్యే , రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటి చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి అన్నారు. రాజవొమ్మంగి మండలం అప్పలరాజు పేట వట్టిగెడ్డ రిజర్వాయర్ లో ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా మత్స్య శాఖ ఆధ్వర్యంలో శనివారం మండల పార్టీ అధ్యక్షులు ఏపీ ఐఐసి డైరెక్టర్ గొల్లపూడి పెద్దిరాజు సౌజన్యంలో జలాశయాల్లో చేప పిల్లలు విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జలాశయాల ద్వారా పంటపొలాలకు సాగు నీరుతో పాటూ మత్స్య సంపదను పెంచుకుంటే అదనపు ఆదాయాన్ని పొందవచ్చున్నారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చేప పిల్లలను విడుదల చేశారు.మత్స్య శాఖ సిబ్బంది ఎప్పటికప్పుడు చేపల పెంపకం పై మత్స్యశాఖ ఆధ్వర్యంలో ఉండే సొసైటీ సభ్యులకు మంచి సూచనలు సలహాలు అందిస్తూ అదనపు ఆదాయాన్ని పెంపొందించు కునేలా చూడాలన్నారు. ఆయా సొసైటీలు కూడా సక్రమంగా నిర్వహించుకుంటూ అభివృద్ధి చెందాలని సూచించారు.

ప్రభుత్వం ద్వారా అందే రాయితీలు అందుతున్నాయా లేదా అనే విషయాలు సొసైటీ సభ్యులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అనంతరం ఆమె చేతులు మీదుగా వట్టిగెడ్డ రిజర్వాయర్ లో 5160 మరియు గింజర్తి రిజర్వాయర్ లో 2850 చేప పిల్లలను విడుదల చేశారు

అందులో బొచ్చు, (రోహో ) రాగండి , ఎర్రమైల జాతులకు చెందిన రకాల చేపలు విడుదల చేశారు. అలాగే భూపతిపాలెం రిజర్వాయర్ లో 25,763, దొరిసినపల్లి గ్రామంలో దెయ్యాల గుమ్మి, రిజర్వాయర్ లో 2580, మరియు అడ్డతీగల మండలం మద్దిగెడ్డ రిజర్వాయర్ లో 23,944 పిల్లలు విడుదల చేశారు. ఆయాచోట్ల సొసైటీ సభ్యులు మాట్లాడుతూ రిజర్వాయర్ ల అభివృద్ధి కొరకు, మరియు సొసైటీ సభ్యులు రిజర్వాయర్ లోకి చేపలవేటకు వెళ్లేటప్పుడు లైఫ్ జాకెట్లు, వగైరా అవసరాలు తీర్చాలని కోరారు స్పందించిన ఆమె మాట్లాడుతూ పై సమస్యల పరిష్కారము కొరకు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.
కార్యక్రమంలో తెదేపా నేతలు నియోజవర్గ మహిళా అధ్యక్షురాలు ముప్పన సావిత్రి, మండల పార్టీ నాయకులు జెట్టి మధు , జనసేన మండల పార్టీ అధ్యక్షుడు బొదిరెడ్డి త్రిమూర్తులు, ముప్పన మోహన్, చీడిపల్లి అప్పారావు, మిరియాల నానిబాబు, చైర్మన్ నూకరాజు, జిల్లా మత్స్యశాఖ అధికారి .దిల్ షాద్, .సునీల్, సత్యవతి, గ్రామ మత్స్యశాఖ సహాయకులు శివసాయి, సత్యనారాయణ, రామకృష్ణ , మునికుమారి, సొసైటీ అధ్యక్షులు మిరియాల శ్రీనుబాబు, చీడిపల్లి అప్పారావు, స్థానిక సర్పంచ్ అగూరి శుభ లక్ష్మి, వార్డు సభ్యులు మిరియాల కృష్ణవేణి, కుంజం సత్తిబాబు, కుంజం సత్య, అధిక సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల ఫిజికల్ కంప్లీషన్‌లో గంగవరం మండలానికి ప్రథమ స్థానం

**రాష్ట్ర కమిషనర్ చేతుల మీదుగా ఎంపీడీఓ, ఏపీఓలకు ప్రత్యేక అభినందనలు**
**హౌస్ ట్యాక్స్, ఐవీఆర్ఎస్‌లోనూ ప్రతిభ కనబర్చిన డీప్యూ ఎంపీడీఓ, కార్యదర్శులకు సర్టిఫికెట్లు**





**గంగవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం లో చేపట్టిన పనులు పూర్తిస్థాయిలో ఉమ్మడి అల్లూరి జిల్లాలో గంగవరం మండలం ప్రథమ స్థానం సాధించింది అలాగే ఇంటి పన్నుల వసూళ్లు ఐవీఆర్ఎస్ ప్రచారంలోనూ మండలంలోని డిప్యూటీ ఎంపీడీవో తో పాటు తొమ్మిది మంది పంచాయతీ కార్యదర్శులకు బెస్ట్ పెర్ఫార్మన్స్ అవార్డులను పొందారు.శనివారం విశాఖపట్నంలో నిర్వహించిన ఏఎస్ఆర్, పోలవరం, విశాఖ జిల్లాల పంచాయతీ కార్యదర్శులు, డిప్యూటీ ఎంపీడీఓలు, ఏపీఓలు, ఎంపీడీఓల సమీక్షా సమావేశంలో గంగవరం మండలం ప్రతిభ చాటుకుంది. ముఖ్యంగా మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల ఫిజికల్ కంప్లీషన్ విభాగంలో ఉమ్మడి ఏఎస్ఆర్ జిల్లాలో గంగవరం మండలం ప్రథమ స్థానంలో నిలవడం విశేషంగా నిలిచింది.ఈ సందర్భంగా గంగవరం మండల ఎంపీడీఓ వై. లక్ష్మణరావు, ఏపీఓ ప్రకాష్‌లను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ కమిషనర్ ఎం.వి. కృష్ణతేజ ప్రత్యేకంగా అభినందించారు. మండల స్థాయిలో సమన్వయంతో, ప్రణాళికాబద్ధంగా పనులు పూర్తి చేయడం వల్లే ఈ విజయాన్ని సాధించగలిగినట్లు కమిషనర్ ప్రశంసించారు.
అదేవిధంగా హౌస్ ట్యాక్స్ వసూళ్లు, ఐవీఆర్ఎస్ అమలు విషయంలో గంగవరం మండల డిప్యూటీ ఎంపీడీఓ నరసింగరావు మరియు 9 గ్రామ పంచాయతీల కార్యదర్శులు విశిష్ట ప్రదర్శన కనబరిచినందుకు సర్టిఫికెట్లతో సత్కరించారు. మంత్రిపాలెం, అముదాలబంద, కొత్తడ, బైనపల్లి, యండపల్లి, పంద్రప్రోలు, మోహనాపురం, దొరమామిడి తదితర పంచాయతీల కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేశారు.
సమీక్షా సమావేశంలో జిల్లాల వారీగా పథకాల అమలు, ఆదాయ వనరుల పెంపు, గ్రామీణ అభివృద్ధి కార్యక్రమాల పురోగతిపై సమగ్రంగా చర్చించారు. గంగవరం మండలం సాధించిన విజయాన్ని ఇతర మండలాలు ఆదర్శంగా తీసుకోవాలని కమిషనర్ సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత జిల్లాల అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.


02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పొ. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి


## సిఐటియు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె పోస్టర్ ఆవిష్కరణ...



**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**
పోలవరం జిల్లా రంపచోడవరం సిఐటియు అనుబంధ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బి నిర్మల అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశంలో ఫిబ్రవరి 12 వ తేదిన జరుగు దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని,సమ్మె పోస్టర్ను ప్రజాసంఘాల కార్యాలయంలో ఆవిష్కరించారు. వివిధ సంస్థల్లో, స్కీం వర్కర్లుగా పనిచేస్తున్న కార్మిక సమస్యలను పరిష్కరించాలని, కార్మికులు సాధించుకున్న హక్కులని కాపాడుకోవాలని కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న పోలవరం జిల్లా రంపచోడవరం జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ లేబర్ కోడ్లు రద్దు కై ఫిబ్రవరి 12 దేశ వ్యాప్తంగా జరుగు సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని యావత్తు కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు!!
కేంద్రంలో బిజెపి ప్రభుత్వం కార్మికులు,ఉద్యోగుల హక్కులను హరించే విధంగా స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తితో సాధించుకున్న కార్మిక చట్టాలన్నింటిని రద్దుచేసి కొత్తగా నాలుగు లేబర్ కోడ్ లను ప్రవేశపెట్టి, కార్మికుల హక్కులు హరిస్తున్నదని అన్నారు.ఈ లేబర్ కోడ్ లు అమలు జరిగితే కార్మిక వర్గంతీవ్రంగా నష్టపోతుందని అన్నారు.కనీసం కార్మికులు యూనియన్ పెట్టుకునే హక్కు,కనీస వేతనం,ఉద్యోగ భద్రత,కార్మిక హక్కులు అడిగే స్వేచ్ఛ మొదలైనవి కోల్పోతారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు అనుకూలమైన విధానాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్నాయి, ఈ విధానాలవలన కార్మిక వర్గం, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, కార్మిక చట్టాలను రద్దుచేస్తే కార్మిక సంక్షేమం,భద్రత అందని ద్రాక్షగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు.
ఈ లేబర్ కోడ్ల వలన కనీస వేతనాలు చట్టం, పీఎఫ్,ఈఎస్ఐ, గ్రాడ్యుటి, లాంటి హక్కులు హరించబడతాయి అన్నారు.సిపిఎం వామపక్ష ప్రభుత్వాలు, ఉన్న కేరళలో, లేబర్ కోడ్లు అమలు చేయమని, అసెంబ్లీలో తీర్మానం చేసి, కేంద్రానికి హెచ్చరిక పంపాయని. ఇది ఉద్యోగులు కార్మికులు,కర్షకుల ప్రభుత్వం అన్నారు.అలాగే ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా లేబర్ కోడ్లను అమలుచేయమని అసెంబ్లీలో తీర్మానం చేయాలన్నారు,అలా చేసే ధైర్యం ఈ కూటమి ప్రభుత్వానికి ఉందా అని అన్నారు. ఈ లేబర్ కోడ్లు అమలు జరిగితే,కార్మిక హక్కులు పూర్తిగా కోల్పోతారని, కార్మికుల మనుగడ ఉండదని దేశంలో ఉన్న జాతీయ కార్మిక సంఘాలు అన్ని ఒక్కతాటిమీదికి వచ్చి ఫిబ్రవరి 12 న దేశవ్యాప్తంగా కేంద్రానికి కనువిప్పు కలిగేవిధంగా ఒక్క రోజు సమ్మె చేయాలని జాతీయ కార్మిక సంఘాల ఐక్య వేదిక పిలుపునిచ్చిందని, దీనిలో భాగంగా కార్మికులు అందరూ ఒక్క రోజు సమ్మెలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రజా తంత్ర ఉద్యమ నాయకులు
బి,కిరణ్ మాట్లాడుతూ కార్మికులందరూ కార్మికుల హక్కులకై సంఘటితంగా పోరాటం చేయాలని ఆయన అన్నారు. ఏదైనా తమ పోరాటం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు చింత రాంబాబు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కే శాంతి రాజు, సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కే రాణి, సిఐటియు మండల కన్వీనర్ తీగల శ్రీనివాస్ సిఐటి జిల్లా నాయకులు ఈతపల్లి సిరిమల్ రెడ్డి, బట్ట లచ్చిరెడ్డి, ఎం వెంకట రామలక్ష్మి, ఎస్ మంగాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

## దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో ఆహార కలుషితం





* బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే శిరీషాదేవి
* సత్వర వైద్యసేవలు చేపట్టాలని వైద్య సిబ్బందికి ఆదేశాలు
* విద్యార్థుల అస్వస్థకు కారకులపై చర్యలు చేపట్టాలి
* ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి

**గంగవరం/ రంపచోడవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవశ్యకత ఉందని రంపచోడవరం ఎమ్మెల్యే రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. దేవరపల్లి ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు కలుషిత ఆహారం తో అస్వస్థత చెందిన విద్యార్థులను శనివారం రంపచోడవరం ప్రాంతీయ ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా రంపచోడవరం ఐటిడిఏ పధక నిర్వహణ అధికారి బచ్చు స్మరణ రాజు తో కలిసి ఆమె వైద్య సిబ్బంది కి పలు సూచనలు చేశారు. ఇప్పటికే అస్వస్థతకు లోనై వాంతులు, జ్వరం, విరోచనాలుతో బాధపడుతున్న 71 మంది విద్యార్థులకు దగ్గరుండి పరామర్శించి మనో ధైర్యాన్ని నింపారు.ఉదయం వారికి పెట్టిన అల్పాహారం, మధ్యాహ్నం పెట్టిన భోజనం పై ఆరా తీసారు. ఉదయం పెట్టిన ఇడ్లీలో పెట్టిన చట్నీ బొంబాయి చట్నీలో లోపాలు ఉన్నాయా లేక మధ్యాహ్నం పెట్టిన కూర పప్పు క్యాబేజీ లో లోపాలు ఉన్నాయా అనేది తేలాల్సి ఉంది. ఇదిలా ఉండగా అస్వస్థతకు లోనైన విద్యార్థులు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. అవసరం అయితే విద్యార్థుల ను ఉన్నత ఆసుపత్రుల్లో చికిత్స కోసం రిఫర్ చేయాలని సూచించారు. ఇది కేవలం పర్యవేక్షణ అధికార్ల లోపం కూడా ఉన్నట్లు తెలిపారు.నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బంది పై చర్యలు తీసుకునే క్రమంలో సంబధిత అధికారుల తాత్సారం కూడా ఇలాంటి చర్యలకు దోహద పడుతుందన్నారు. నిర్లక్ష్యానికి కారకులైన సిబ్బందిపై చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులకు
ఆదేశిందేశించారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు పెంటపాటి అనంత మోహన్, ఏఎంసి వైస్ చైర్మన్ సలాది బాపిరాజు, అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు అడబాల బాపిరాజు , సీతపల్లి దేవస్తానం సభ్యులు సిద్ధా వెంకన్న దొర, క్లస్టర్ ఇంచార్జి కారం సింహాచలం, పారా వెంకన్న,జనసేన మండల పార్టీ అధ్యక్షులు పాపోలు శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల ఉన్నతికి “విద్యాంజలి“

**గంగవరం/ పెన్ పవర్, ఫిబ్రవరి 7:**పాఠశాలలలో విద్యాప్రమాణాలు, మౌలిక సదుపాయాలను సమాజ భాగస్వామ్యంతో అనుసంధానం చేసి మెరుగుపరచడానికి విద్యాంజలి కార్యక్రమం ఉపయోగపడుతుందని మండల విద్యాశాఖ అధికారి 2 పి మల్లేశ్వరరావు అన్నారు. శనివారం స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలిక ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన బోధన, నైపుణ్యాలు, సహ పాఠ్య కార్యక్రమాలకు ఈ కార్యక్రమం ఒక అద్భుత వేదిక అన్నారు. విద్యాంజలి కార్యక్రమంలో వాలంటీరు, ఎన్జీవోస్, కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద పాఠశాలల అభివృద్ధికి ఎన్నో కార్యక్రమాలు చేపట్టడానికి వీలవుతుందన్నారు. యు డైస్




నెంబర్ కలిగిన ప్రతి పాఠశాల విద్యాంజలి పోర్టల్ లో నమోదు చేసుకుని వారికి కావలసిన సౌకర్యాలను వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమానికి రిసోర్స్ పర్సన్స్ గా దిండి శేఖర్ వ్యవహరించి ఆన్లైన్లో పాఠశాలను ఎలా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి, సేవలను ఎలా వినియోగించుకోవాలి అనే కార్యక్రమం పై శిక్షణ




ఇచ్చారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు ఆర్ వి వి సత్యనారాయణ ,ప్రధానోపాధ్యాయులు శ్రీ రాములు దొర ,నాగేశ్వరరావు ,కస్తూరిబా బాలిక విద్యాలయం ప్రిన్సిపాల్ పద్మావతి ,సిఆర్ఎంటి లు శివ, విజయభాస్కర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా పర్యాటకం రంగం



- 2024-26 ఏపీ పర్యాటక రంగంలో స్వర్ణయుగం
- మీడియా సమావేశంలో మంత్రి కందుల దుర్గేష్ వెల్లడి

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో పర్యాటక రంగాన్ని రాష్ట్ర ఆర్థిక వృద్ధికి వెన్నెముకగా మారుస్తున్నా మని మంత్రి దుర్గేష్ తెలిపారు. 20 నెలల్లో రూ. 30వేల కోట్ల పర్యాటక పెట్టుబడులు, 1.22 లక్షల ఉద్యోగాలు సృష్టించామమన్నారు.ప్రతి కుటుంబానికి ఒక పర్యాటక ఉద్యోగం“ కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. శనివారం స్థానిక క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు సూచనలతో “హెల్తీ, వెల్తీ, హ్యాపీ“ నినాదంతో అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దుతు న్నామన్నారు. 2019-24 మధ్య గత ప్రభుత్వం కుదేలు చేసిన పర్యాటక రంగాన్ని ప్రస్తుతం పట్టాలెక్కిస్తున్నామని, నూతన పర్యాటక పాలసీ (2024-29) తో పారిశ్రామిక హోదా కల్పించామని పేర్కొన్నారు. ఏపీ బ్రాండ్ పెరిగి పర్యాటకుల రాక పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పర్యాటకరంగంలో పెట్టుబడులు పెట్టేందుకు , 117 సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకున్నామన్నారు.

కేంద్ర ప్రభుత్వం నుండి 8 పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి 428 కోట్ల గ్రాంట్‌ను సాధించామని మంత్రి దుర్గేష్ వివరించారు. శాస్కి ద్వారా అఖండ గోదావరికి రూ.94.44 కోట్లు, గండికోట అభివృద్ధికి రూ. 77.91 కోట్లు, స్వదేశీ దర్శన్ 2.0 ద్వారా సూర్యలంక బీచ్ అభివృద్ధికి రూ.97.52 కోట్లు, బొర్రా గుహల అభివృద్ధికి రూ.29.88 కోట్లు, ఛాలెంజ్ బేస్డ్ డెస్టినేషన్ డెవలప్ మెంట్ స్కీమ్ ల ద్వారా అహోబిలం అభివృద్ధికి రూ.25 కోట్లు, నాగార్జున సాగర్ బౌద్ధ వారసత్వ కేంద్రాల అభివృద్ధికి రూ.25 కోట్లు, ప్రసాద్ ద్వారా అన్నవరం దేవస్థానంలో మౌలిక సదుపాయాల కల్పనకు రూ.25.32 కోట్లు మంజూరు అయ్యాయి. ఆయా ప్రాంతాల్లో శరవేగంగా పనులు జరుగుతున్నా యన్నారు. పుష్కర్ ఘాట్ అభివృద్ధి, హేవలాక్ వంతెన ఆధునీకీకరణ, బ్రిడ్జిలంకలో సాహస క్రీడలు, కడియం నర్సరీలో ఎక్స్ పీరియన్స్ సెంటర్, నిడదవోలు కోట సత్తెమ్మ ఆలయం అభివృద్ధి, శెట్టిపేటలో బోటింగ్ ఏర్పాటు చేస్తామన్నారు. విశాఖపట్నం, అరకు, రాజమండ్రి, అమరావతి, శ్రీశైలం, తిరుపతి గండికోట వంటి 7 యాంకర్ హబ్‌లు, రాష్ట్రంలో 2 బుద్ధిస్ట్, 10 టెంపుల్, 5 బీచ్, 4 రివర్ క్రూయిజ్, 3 ఎకో, 2 సీ క్రూయిజ్, సీప్లేన్ టూరిజం సర్క్యూట్ లు తదితర 25కి పైగా థీమాటిక్ సర్క్యూట్లు, 90కి పైగా ప్రదేశాలలో అడ్వెంచర్ టూరిజంకు అనుమతులు లభించాయని మంత్రి దుర్గేష్ స్పష్టం చేశారు.కేరళ తరహాలో రాజమండ్రి, విజయవాడ సహా 8 ప్రాంతాల్లో హౌస్ బోట్లు, విశాఖ- చెన్నై- పుదుచ్చేరికి కార్డెలియా క్రూయిజ్ సేవలు ప్రారంభమయ్యాయన్నారు.సీప్లేన్ కు వయబులిటీ గ్యాప్ ఫండింగ్ ఇస్తామని కేంద్రం తెలిపిందన్నారు. సీ క్రూయిజ్, హెలీ టూరిజం, కారవాన్ టూరిజం, టెంట్ సిటీలు హౌస్‌బోట్ సేవలను విస్తరించామన్నారు. 1,855 హోమ్‌స్టేలను అగ్రిగేటర్ ప్లాట్‌ఫారమ్‌లతో అనుసంధానించామని, కోనసీమ, ఉభయగోదావరి జిల్లాలో ఉన్న మండువా లోగిళ్లను అభివృద్ధి చేస్తున్నామన్నారు. శాఖ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకునేవాళ్లకు ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ ద్వారా రూ.115 కోట్ల వ్యయంతో 15 హరిత హోటళ్లను ఆధునీకరించి మౌలిక సదుపాయాలను మెరుగుప రిచామన్నారు. అరకు కాఫీ తరహాలో ‘అరకు కౌని‘ (చిరుధాన్యాల తాలీ)ని పర్యాటకులకు పరిచయం చేస్తున్నామని అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ యత్నం అభినందనీయమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 21 ప్రధాన పుణ్యక్షేత్రాలను గుర్తించి టెంట్ సిటీలు ఏర్పాటు చేసి యాత్రికులకు తక్కువ ఖర్చుకే వసతి కల్పిస్తున్నామన్నారు.

ప్రస్తుతం 27 ప్రాజెక్టులకు ఎస్ఐపీబీ అనుమతులు లభించగా, 3 ప్రారంభానికి సిద్ధంగాను, 12 పురోగతిలో ఉన్నాయని, 5 ప్రాజెక్టులు శంకుస్థాపనకు ఉన్నాయని తెలిపారు. మరో 7 ప్రాజెక్టులకు భూ కేటాయింపులు పూర్తి అయ్యాయని అన్నారు. 4,839 రూమ్స్ అందుబాటులోకి రానున్నాయని, ఐదేళ్లలో 50,000 రూమ్స్ లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. వీటి ద్వారా పర్యాటక రంగంలో 1,22,637 ఉద్యోగాలకి మార్గం సుగమం చేశామన్నారు. 2025-26లో దేశవ్యాప్తంగా 11,272 రూమ్స్ లో మూడింట ఒక వంతు హోటళ్లు ఏపీలోనే ఏర్పాటయన్నారు. ఇన్వెస్టర్లకు క్యాపిటల్ సబ్సిడీలు, ఎస్జీఎస్టీ రీయింబర్స్‌మెంట్ స్టాంపు డ్యూటీ మినహాయింపు ప్రోత్సాహకాలను అందిస్తున్నామన్నారు. స్పీడ్ ఆఫ్ డూయింగ్ లో అనుమతులు ఇస్తున్నామన్నారు. రాష్ట్ర సంస్కృతిని చాటిచెప్పేలా విజయవాడ, విశాఖ, అరకు ఉత్సవం, గండికోట, అమరావతి ఆవకాయ్ వంటి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించామని మంత్రి దుర్గేష్ తెలిపారు. నంది అవార్డులు, నంది నాటకోత్సవాలను పునరుద్ధరిస్తున్నామని, రాజమండ్రిలో నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా బ్రాంచ్ ఏర్పాటుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసిందనన్నారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సూచనల మేరకు సూర్యరాయ ఆంధ్ర నిఘంటువును పునర్ముద్రిం చనున్నామన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఉగాది, కందుకూరి పురస్కారాలు ప్రదానం చేశామన్నారు. వెళ్తామన్నారు.

జగన్ రెడ్డి చేస్తున్న యాత్రలు డైవర్షన్ పాలిటిక్స్ లో భాగం...

గత ప్రభుత్వం పర్యాటకాన్ని తమ స్వంత లాభాలకే వినియోగించుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.పర్యాటక రంగంతో పాటు కళా, సాంస్కృతిక రంగాలను గత ప్రభుత్వం నాశనం చేసిందన్నారు. . గడిచిన ఐదేళ్లలో కళాకారులను గౌరవించలేదన్నారు. తిరుమల లడ్డూలో కల్తీ జరిగిందని సాక్ష్యాత్తు నాటి టీటీడీ ఛైర్మన్ గా పనిచేసిన వైవీ సుబ్బారెడ్డే చెప్పారన్నారు.తప్పు చేసిన వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జరిగిన తప్పును సమర్థించుకోవడానికి ఎదురుదాడి చేస్తున్నారని ఎద్దేవా చేశారు. జగన్ రెడ్డి చేస్తున్న యాత్రలు డైవర్షన్ పాలిటిక్స్ లో భాగమన్నారు. ఆయన చేయాల్సింది ఓదార్పు యాత్రలు కాదు ప్రాయశ్చిత యాత్రలు అన్నారు.

,అంతర్జాతీయ పర్యాటక డెస్క్ లు, ప్రధాన పర్యాటక అగ్రిగేటర్లకు స్థలాలు, వీసా ఫెసిలిటేషన్ కౌంటర్లు ఏర్పాటు కోసం రూ.100 కోట్లతో అమరావతిలో ఇంటిగ్రేటెడ్ ఎక్స్ పీరియన్స్, ఇంటర్ ప్రెటేషన్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఏర్పాటు చేసి అభివృద్ధి కు నిధులు మంజూరు చేయాలని కోరామన్నారు. అమరావతిలో పర్యాటక భవన్ కు సంకల్పించామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 60కి పైగా ప్రదేశాలలో వాటర్ స్పోర్ట్స్, అడ్వెంచర్ టూరిజం ప్రారంభించ నున్నట్లు తెలిపారు. బ్లూ ఫ్లాగ్ బీచ్‌లు, ఎకో-టూరిజం టెంట్ సిటీలను విస్తరించడం, పర్యాటక శాఖకు బ్రాండింగ్, మార్కెటింగ్, ఈవెంట్స్ నిర్వహణ కోసం రూ.150 కోట్ల బడ్జెట్ కేటాయించాలని ఆర్థికశాఖకు ప్రతిపాదనలు పెట్టామన్నారు. పర్యాటక రంగానికి కొత్త శోభ తెచ్చేదిశగా 8 మెగా ఈవెంట్స్, 11 నేషనల్ ఫెయిర్స్, 10 ఇంటర్నేషన్ ఫెయిర్స్ కు రూపకల్పన చేస్తున్నామన్నారు. ఏపీలో వెల్ నెస్ సెంటర్లు ఏర్పాటు లో పెట్టుబడులు పెడతామని జర్మనీ తెలిపిందన్నారు.

పర్యాటకుల భద్రతకు ప్రాధాన్యమిస్తూ

మన్నారు. గతంలో దేవీపట్నం, పాపికొండలు తదితర ప్రాంతాల్లో జరిగిన దుష్పరిణామాలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

రాజమహేంద్రవరంలో పులిని పట్టుకోవడంలో అటవీ అధికారులు సక్సెస్ అయ్యారని వారిని అభినందించారు. .

నిడదవోలు నియోజకవర్గ ప్రగతి

మంత్రిగా దుర్గేష్ తన నియోజకవర్గమైన నిడదవోలు అభివృద్ధిని ప్రస్తావిస్తూ, 20 నెలల్లో రూ 500 కోట్లతో సమగ్రాభివృద్ధి చేపట్టామని తెలిపారు. నిడదవోలుకు ‘స్పెషల్ గ్రేడ్ మున్సిపాలిటీ‘ హోదా సాధించామన్నారు. పట్టణ అభివృద్ధికి రూ.110 కోట్లు, అఖండ గోదావరి ప్రాజెక్టులో భాగంగా రూ.3 కోట్లు కేటాయింపులకు కృషి చేశానన్నారు. . నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణం జల్ జీవన్ మిషన్ పనులు సాగుతున్నాయని వివరించారు.

## తల్లితండ్రులను కోల్పోయి పిల్లలకు ఓదార్పు, ఆర్థిక సహాయం చేసిన వడ్డి రఘురామ్





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 07.**తాడేపల్లిగూడెం రూరల్ మండలం పుల్లయిగూడెం గ్రామానికి చెందిన పెదమూర్తి శిరీష, పెదమూర్తి జీవ, పెదమూర్తి సతీష్, పెదమూర్తి సింధు అనే పిల్లలు తమ తల్లితండ్రులను కోల్పోయి తీవ్ర దుఃఖంలో ఉన్నారని తెలుసుకున్న తాడేపల్లిగూడెం నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇంచార్జ్ వడ్డి రఘురామ్ నాయుడు వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

వారికి ఆర్థికంగా సాయం చేసి పిల్లలకి మూడు నెలలు కంప్యూటర్ శిక్షణ ఇపిస్తానని చెప్పి కష్టసమయంలో పిల్లలకు మరియు కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, వైఎస్ఆర్ సీపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించిన కమిషనర్ ఏసుబాబు





**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 07:**ఈరోజు తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలో యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే లో భాగంగా మున్సిపల్ కమిషనర్ శ్రీ ఎం ఏసు బాబు 33వ వార్డును పర్యవేక్షించారు. వార్డులోని ఇంటింటికి వెళ్లి ఈ సర్వే ఉపయోగాలను తెలియజేశారు. యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ను త్వరితగతిన పూర్తి చేయాలని ఈరోజు సాయంత్రం లోపు పూర్తి చేయాలని ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చారు. పురపాలక సంఘం కార్యాలయం వద్ద ఉన్న అన్నా క్యాంటీన్ తనిఖీ చేసి పరిసరాలు, పారిశుధ్యం, వసతులు పరిశీలించారు. అన్నా క్యాంటీన్లో టిఫిన్ తింటున్న ప్రజలతో మాట్లాడి రుచి, శుభ్రత, నాణ్యత ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. స్వయంగా మున్సిపల్ కమిషనర్ కూడా పురపాలక సంఘ సిబ్బందితో టిఫిన్ తిని రుచి, నాణ్యత ఎలా ఉన్నాయో చూశారు. పురపాలక సంఘంలోని కెఎన్ రోడ్డులో శానిటేషన్ జరిగిన విధానాన్ని పరిశీలించారు, పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వర్కర్లకు, ఉద్యోగులకు ఆదేశాలు ఇచ్చారు. పట్టణ అభివృద్ధి కోసం ఎస్వీఆర్ విగ్రహం వద్ద నూతనంగా ఫుడ్ కోర్ట్ కోసం నిర్మిస్తున్న షెడ్లను పరిశీలించారు. పనులన్నీ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

తాడేపల్లిగూడెం పురపాలక సంఘంలోని ప్రజలందరూ ఇంటి పన్ను, కుళాయి పన్నులను బకాయి లేకుండా చెల్లించాలని తెలియజేశారు.

## ముద్రగడపై అనుచిత వ్యాఖ్యలు తగవు-తోట రామకృష్ణ



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మాటకు కట్టుబడి తన పేరు మార్చుకున్నారని, కులం మార్చుకోలేదని కాపుల కోసం అహర్నిశలు కృషి చేసిన వ్యక్తి ముద్రగడ అని, పెద్దేవం గ్రామానికి చెందిన కాపు రాష్ట్ర జేఏసీ సభ్యుడు తోట రామకృష్ణ ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో పేర్కొన్నారు. తాడేపల్లిగూడెం జనసేన ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ ముద్రగడ పద్మనాభంపై చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. వంగవీటి మోహన్ రంగా తరువాత అంతటి పేరు తెచ్చుకున్న వ్యక్తి ముద్రగడ పద్మనాభమని, కాపులకు బిసి రిజర్వేషన్ కోసం ఉద్యమం చేసిన ఘనత ముద్రగడకి అని, అలాంటి ముద్రగడ పద్మనాభంపై వ్యాఖ్యలు చేయటం సమంజసం కాదన్నారు. కాపుల రిజర్వేషన్ కోసం కాపు కార్పొరేషన్ కోసం అసెంబ్లీలో ప్రజలకు ఉపయోగపడేలా వ్యవహరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తాళ్లపూడి మండలం కాపు సంఘం అధ్యక్షుడు నామా ప్రకాశం, కాపు సంఘం జిల్లా వైస్ ప్రెసిడెంట్ వనిమిరెడ్డి శ్రీను, కాపు నాయకులు కొలిశెట్టి నాగేశ్వరావు, ఇంటి వీర్రాజు, కోడి గంగారావు, మేణ్ణి గణేష్, మేణ్ణి చిన్న, మేణ్ణి చిట్టయ్య, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## అన్నదేవరపేటలో సొసైటీ పెట్రోల్ బంక్ ప్రారంభించిన ఎమ్మెల్యే ముప్పిడి



**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**సొసైటీల ద్వారా వినియోగదారులకు, ముఖ్యంగా రైతులకు నాణ్యమైన ఉత్పత్తుల విక్రయాలకి అవకాశం ఉంతుందని, వాటిని వినియోగించుకోవాలని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. తాళ్లపూడి మండలంలోని అన్నదేవరపేట సొసైటీ ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ను శనివారం పునః ప్రారంభించారు. ఈ సందర్భాన్గా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వంలో పెట్రోల్ బంక్ నడపలేక మూతా వేశారని, తమ ప్రభుత్వం వచ్చాక ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సొసైటీ నూతన అధ్యక్షులు జి.వి.ప్రసాద్(జివి) అద్వర్యంలో తిరిగి ప్రారంభించామని తెలిపారు. మొదటి కొనుగోలు పైడిమెట్ట ఎత్తి పోతల పథకం అధ్యక్షులు ముళ్ళపూడి శ్రీరామచంద్ర మూర్తి చేశారు. తిరుగుడుమెట్ట, వేగేశ్వరపురం గోడౌన్స్ ను వినియోగంలోకి తెచ్చి రైతులకు సహకారం అందించాలని ఎమ్మెల్యేని కోరారు. నాయకులు మద్దిపట్ల శివ రామకృష్ణ, సూరపనేని చిన్ని ఎమ్మెల్యే వెంట ఉన్నారు. ఈ కార్యక్రమంలో అల్లూరి విక్రమాదిత్య, సొసైటీ డైరెక్టర్ లు చెవ్వూరి బంగార్రాజు, వెలుగుబంటి బాలకృష్ణ, కాకర్ల సత్యేంద్ర, కూచిపూడి గణపతి, కూచిపూడి లక్ష్మణరావు, చెవ్వూరి రాము, పలు గ్రామాల నాయకులు, ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


## నేడు రాజానగరంలో మెగా జాబ్ మేళా..

- ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మూడు వేల మందికి ఉద్యోగ అవకాశాలు..
- జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ వెల్లడి..




**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 7:** రాజానగరం హై స్కూల్ వద్ద ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు రాజానగరం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ ఆధ్వర్యంలో మెగా జాబ్ మేళా నిర్వహించి మూడు వేల మందికి జాబ్ మేళాలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు. ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనేందుకు యువతకు మంచి అవకాశం అని జనసేన పార్టీ సీనియర్ నాయకులు అడపా శ్రీనివాస్ వెల్లడించారు.

## తాళ్ళపూడిలో ‘శ్రీమన్నారాయణ మహా యజ్ఞ‘ మహోత్సవం





**తాళ్ళపూడి, పెన్ పవర్, ఫిబ్రవరి 7 :**ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నిలువైన తాళ్ళపూడి మండల కేంద్రంలో మహాలక్ష్మీ సహిత శ్రీమన్నారాయణ మహా యజ్ఞ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. తాళ్ళపూడిలో శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ మదన గోపాల స్వామి వారి ఆలయ ప్రాంగణంలో వేంచేసియున్న రాజ్యలక్ష్మి అమ్మవారి దేవాలయ ఆలయ అర్చకులు గోవర్ధనం శ్రీనివాస చక్రవర్తి ఆధ్వర్యంలో అష్టాక్షరీ మహా మంత్రానుష్ఠాన పూర్వక శ్రీ మహాలక్ష్మీ సహిత శ్రీమన్నారాయణ యజ్ఞ మహోత్సవాలు ఆదివారంతో ముగుస్తాయి. లోక కళ్యాణార్థం జరిగే ఈ యజ్ఞ క్రతువును వైఖసన ఆగమ సుధానిది శ్రీమాన్ ఖండవల్లి సూర్యనారాయాణా చార్యులు, బిక్కవోలు కేసవ రామా చార్యులు నిర్వహుస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంట వరకు ఈ యజ్ఞం మహోత్సవం జరుగుతోందని. అనంతరం శ్రీమన్నారాయణ యజ్ఞ ఫల ప్రసాదం స్వీకరించాలని అర్చకులు చక్రవర్తి పేర్కొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# మధురపూడి ఎయిర్పోర్ట్ నూతన టెర్మినల్ నిర్మాణ పనులను పర్యవేక్షిన..

- విమానా శాఖామంత్రి కింజారపు రామ్మోహన్, ఎమ్మెల్యే బత్తుల,రుడా చైర్మన్ బొడ్డు..





**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుతో కలిసి మధురపూడి విమానాశ్రయం అభివృద్ధిలో భాగంగా నూతన టెర్మినల్ నిర్మాణ పనులను పర్యవేక్షించరు. ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రాజమండ్రి సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్,రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఎయిర్పోర్ట్ అధికారులు,జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పెండింగులో ఉన్న క్లెయిమ్ లకు నిధులు విడుదల చేయాలి

- పశ్చిమగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ).



**తాడేపల్లిగూడెం, పెన్ పవర్. ఫిబ్రవరి 07.**భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డులో పథకాల అమలుపై ఫిబ్రవరి 5వ తారీఖున ముఖ్యమంత్రి గారి సమీక్ష ఆహ్వానించదగ్గ పరిణామం,

కానీ ఈ సమీక్షలో కార్మికులకు పెండింగ్ క్లెయిమ్స్ నిధుల విడుదల చర్చల గురించి చర్చ లేకపోవడం తీవ్ర నిరాశ కలిగిస్తుందని , జిల్లా అధ్యక్షులు బొల్లాడ నాగరాజు, ప్రధాన కార్యదర్శి పోలిరాతి ఆదినారాయణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి మైలవరపు శ్రీరాంబాబు, కోశాధికారి ఏడిద వాసు, పశ్చిమగోదావరి జిల్లా భవన నిర్మాణ కార్మిక సంఘం (ఏఐటీయూసీ) ఆందోళన వ్యక్తం చేసింది. కార్మికులు దరఖాస్తు చేసిన, సంక్షేమ బోర్డులో నమోదైన క్లెయిమ్‌లు, పెండింగ్‌లో ఉండటం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని సంఘం పేర్కొంది. నిర్మాణ కార్మికుల పని ప్రదేశంలో జరిగే ప్రమాదాల వలన గాయపడిన, మరణించిన కార్మికుల కుటుంబాల సంక్షేమం కోసం, సంక్షేమ బోర్డు ని ఏర్పాటు చేశారు. ప్రమాద బీమా, మరణ పరిహారం, పని ప్రదేశంలో ప్రమాదం జరిగిన సమయంలో, కార్మికుడు పనిలోకి వెళ్లలేని కాలానికి ఇచ్చే కనీస భృతి,వంటి ముఖ్యమైన పథకాలు ప్రస్తానంలో లేకపోవడంతో కార్మికుల్లో ఆందోళన ఏర్పడిందని పథకాల కింద అర్జీ పెట్టుకున్న కార్మికులు ఎన్నో ఏళ్లగా ఆశగా కూటమి ప్రభుత్వం మీద ఎంతో నమ్మకంతో ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు అని పేర్కొన్నారు.

### జనసైనికులకు అండగా జనసేన ఉండగా-ఇంచార్జ్ సువర్ణరాజు.



**గోపాలపురం, పెన్ పవర్, ఫిబ్రవరి 7.**ఆపదలో ఉన్న జనసైనికులకు జనసేన పార్టీ ఎప్పుడు అండగా ఉంటుందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ దొడ్డి గర్ల సువర్ణ రాజు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని దేవరపల్లి మండలం, చిన్నాయగూడెం గ్రామానికి చెందిన జనసైనికుడు మద్దిరాల సతీష్ గత మూడు నెలలు కిందట మృతి చెందినట్లు సువర్ణ రాజు తెలిపారు. అయితే తమ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, పార్టీ సిద్ధాంతం ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే అన్నారు. అందులో భాగంగా జనసైనికులు సమకూర్చిన 23 వేల రూపాయల నగదును పార్టీ తరపున బాధిత కుటుంబానికి శనివారం అందజేశామన్నారు. ఈ సందర్భంగా సువర్ణ రాజు మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా ఎక్కడ ఎవరికి ఏ ఇబ్బంది కలిగిన ముందుండేది జనసైనికులేనని అన్నారు. ఆపదలో ఉన్నవారికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తూ వారి బాధల్లో భాగస్వాములు అవుతూ బాధిత కుటుంబాలను ఓదార్చుతూ జనసైనికులు చేస్తున్న కృషి మరువలేనిదని కొనియాడారు. సమస్యలతో సతమతమయ్యే వారికి ఆపన్న హస్తం అందించవలసిన అవసరం ప్రతి ఒక్కరికి ఉందన్నారు. అయితే అందుకు జనసైనికుల్ని నిర్దర్శనంగా తీసుకోవచ్చన్నారు. ఆయన వెంట గ్రామ కమిటీ అధ్యక్షులు మద్దిరాల శ్రీనివాస్, అనిశెట్టి గంగరాజు, బల్ల రాము, పట్టపు శివ, గుడిసె పోస్ట్ బాబు, సత్తిబాబు, టీవీఎస్ ఎన్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# వికసిత్ భారత్ కు దోహదం చేసే కేంద్ర బడ్జెట్ ను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి




- ఈ బడ్జెట్ లో యువతకు ఉపాధి కల్పన, సమగ్ర దేశాభివృద్ధి సాధ్యం
- పర్యావరణహితం అరుదైన ఖనిజ మూలకాల వెలికితీత, తయారీ రంగం
- అన్ని రంగాల్లోనూ స్వయం సమృద్ధి, తయారీ రంగానికి ప్రోత్సాహం
- మీడియా సమావేశంలో కేంద్ర బడ్జెట్ ను విశ్లేషించిన కేంద్ర విమానయాన మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:** కేంద్రంలో ఎన్డీఏ కూటమి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్ దేశంలో యువతకు ఉపాధి కల్పనతో పాటు, సమగ్ర అభివృద్ధికి దోహద పడుతుందని, ఈ బడ్జెట్ ప్రయోజనాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కేంద్ర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు విజ్ఞప్తి చేశారు. గత 12 సంవత్సరాలలో దేశ ప్రధానిగా నరేంద్ర వికసిత్ భారత్ 2047 లక్ష్యంగా, ప్రపంచంలో ఏడు శాతం వృద్ధి రేటు తో నాలుగవ ఆర్థిక శక్తిగా భారత్ ను నిలబెట్టేందుకు నిరంతరం శ్రమిస్తున్నరన్నారు. ప్రధాని మోడీ నేతృత్వంలో 9సార్లు బడ్జెట్ ను ప్రవేశపెట్టిన మహిళా ఆర్థిక మంత్రి గా నిర్మలా సీతారామన్ చరిత్రలో నిలిచిపోతారన్నారు. స్థానిక మంజీరా కన్వెన్షన్ హాల్లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, కేంద్రం ప్రవేశపెట్టిన 20 26 లో బడ్జెట్లో

దేశంలో జాతీయ రహదారులు, రైల్వే సీపోర్టులు, ఎయిర్ పోర్టు , రవాణా, కంటైనర్ సౌకర్యాలు వంటి మౌలిక వసతుల అభివృద్ధికి వేల కోట్ల రూపాయల నిధులు కేటాయించారన్నారు. సమాచార సాంకేతిక , గ్రీన్ ఎనర్జీ రంగాల్లో కీలక కీలకమైన రేర్ ఎర్త్ ఖనిజాలు వెలికితీత, తయారీ, మార్కెటింగ్ కారిడార్ ను బడ్జెట్లో ప్రవేశపెట్టామన్నారు. అయితే నూతన సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో వచ్చిన దృష్ట్యా పర్యావరణం హితం కోరుతూ ప్రాసెసింగ్ ఉంటుందన్నారు. దేశంలో మహిళా సాధికారతను కోరుతూ ప్రతి జిల్లాలో ఒక మహిళ హాస్టల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశంలో స్టార్టప్ లను, తయారీ రంగాలను , బయో ఫార్మా, వైద్య , ఆరోగ్య ఐటి రంగాల్లో ఎమ్మెస్ ఎంఈ పరిశ్రమలు ఏర్పాటుకు అధికమైన నిధులు కేటాయించరన్నారు. ఈ రంగాల్లో సాధించిన ప్రగతి ఫలాలను 2047 నాటికి పది శాతం ప్రపంచానికి ఎగుమతి చేస్తుందన్నారు. దేశంలో సివిల్ విమానయాన రంగంలో ఉడాన్ పథకం లో 20 47 నాటికి 350 ఎయిర్పోర్టు నిర్మాణ లక్ష్యంగా ప్యాసింజర్ విమానాలు, సీ ప్లేన్ ల తయారీ ప్రణాళికలు ఉన్నాయన్నారు.

ఆంధ్రప్రదేశ్ వచ్చే 20 ఏళ్లలో ఐటీ రంగంలోనూ, మౌలిక వసతుల అభివృద్ధిలోనూ దేశంలోనే ప్రథమ స్థానంలో ఉంటుందన్నారు. రాష్ట్రంలోనూ పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణాలకు, తాగునీటి ప్రాజెక్టులకు, విశాఖ స్టీల్ ప్లాంట్ అభివృద్ధికి ,విశాఖ రైల్వే జోన్ కు, సముద్రతీర పర్యాటక రంగానికి , కేంద్ర బడ్జెట్లో కేటాయించడం జరిగిందన్నారు. 2047 నాటికి భారత్ బలమైన ఆర్థిక శక్తిగా బలోపేతం కావడానికి బలమైన పునాదులు పడుతున్నాయని ప్రజలు భాగస్వామ్యం వహించాలని అన్నారు.

కోటిపల్లి నరసాపురం రైల్వే లైన్ పూర్తి చేస్తామన్నారు. గోదావరి నదిపై రోడ్ కం రైలు బ్రిడ్జి స్థానంలో మరొక టి నిర్మాణ ప్రతిపాదన ప్రతిపాదన పై ఆలోచిస్తామన్నారు. 2027 గోదావరి పుష్కరాలకు కేంద్రం నుంచి నిధులు లభ్యతకు ఎటువంటి సమస్య లేదన్నారు.

రాష్ట్రంలో జిల్లాల వారీగా అభివృద్ధికి ప్రణాళికలు

రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలలో వై సీపీ ప్రభుత్వం అన్ని విధాల సర్వ నాశనం చేసిందని ఎంపీ రామ్మోహన్ నాయుడు అన్నారు. రాష్ట్రంలో జిల్లాల వారిగా పరిస్థితులు బట్టి అనుకూలమైన పరిశ్రమలను ఏర్పాటు చేసి అభివృద్ధి చేస్తామన్నారు. తిరుమల లడ్డు కల్తీ వ్యవహారంలోనూ వైసిపి వాళ్ళకి నేరం జరిగిందని వారి మనసాక్షికి తెలుసని, అయినప్పటికీ అసత్యాలతో , ఎదురు దాడులతో బొంకుతున్నారని విమర్శించారు. చంద్రబాబు నాయుడు అంబటి రాంబాబు ల కేసులకు తేడా ఉందని, చంద్రబాబు నాయుడుది అక్రమ కేసుని , అంబటి రాంబాబు సీఎం ను అసభ్య పదజాలంతో దూషించిన కేసని, శాంతి భద్రతలకు విఘాతం కలిగించే అలాంటి నేరస్థలను అరెస్టు చేయక తప్పదన్నారు.

ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్య చౌదరి, ఆదిరెడ్డి శ్రీనివాసు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు , మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు తదితరులు పాల్గొన్నారు

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# మహాత్మా గాంధీ పేరును తొలగించడం చాలా దుర్మార్గం

మాజీ ఎంపీ హర్ష కుమార్




**సీతానగరం, పెన్ పవర్, ఫిబ్రవరి 7:** సీతానగరం మండలంలోని సీతానగరం గ్రామంలో గల కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో శనివారం హర్ష కూమార్ చేరుకుని మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం ఉపాధి హామీ కూలీలతో కలిసి గోడ పత్రికను ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీ హర్ష కుమార్ విలేకరులతో మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని ఎందుకు రద్దు చేస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికీ సగటున 50 రోజులకు మించి ఉపాధి పనులు కల్పించలేని దుస్థితిలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని విమర్శించారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారించలేకపోతున్నారని తెలిపారు. గ్రామాలలో వలసలు నివారించాలంటే ఉపాధి పనులు 200 రోజులు కల్పించాలని డిమాండ్ చేశారు. నేటి ధరలకు అనుగుణంగా రూ.600 కూలి రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు. మనకు స్వతంత్రం రావడంలో కీలక పాత్ర పోషించిన మహాత్మాగాంధీ పేరు మార్చి వికసిత భారత్ జి రామ్ జీ అనే పేరు మార్చడం దారుణం అని అన్నారు. ఈ మార్పులు చేర్పులను ఉపాధి హామీ వేతన దారులు గమనించి స్వయంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. పాత పద్ధతిలోనే మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం ఉండాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎంఎల్ రాష్ట్ర కార్యదర్శి పలివేల వీరబాబు, మాజీ ఎంపీ తనయుడు జీవి శ్రీరాజ్, కాంగ్రెస్ నాయకులు ఉపాధి హామీ వేతన దారులు పాల్గొన్నారు.

# కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి ఉత్సవాలకి ఘనంగా ఏర్పాట్లు..

-- రాష్ట్రం నలుమూలల నుండి తరలివచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూసుకోవాలి ఎమ్మెల్యే బత్తుల





**కోరుకొండ, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అత్యంత వైభవంగా స్వామి వారి దివ్య కళ్యాణనికి భారీ ఏర్పాట్లు. ఈ సందర్భంగా ఫిబ్రవరి 26 నుండి మార్చ్ 4 వరకు జరగబోయే కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవాలు పురస్కరించుకుని రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, ఆలయ ధర్మకర్త, ఆలయ పండితులు, అన్నవరం దేవస్థానం అధికారులు, ఆలయ ఉత్సవ కమిటీ మరియు సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్వామి వారి దివ్య కళ్యాణం గత సంవత్సరం కంటే ఈ సంవత్సరం అత్యంత వైభవంగా శోభాయమానంగా జరిపించాలని ఉత్సవ కమిటీ వారిని ఆదేశించారు. ఈ ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన సదుపాయాలు ఏర్పాటు చేయాలనీ, ఎండలు తీవ్రతరం అవుతున్న తరుణంలో త్రాగు నీరు కొరత లేకుండా చూడాలని, ఉత్సవాలకు వచ్చిన భక్తులకు స్వామి వారి దర్శనం ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని ఈ సందర్భంగా తెలియజేసారు.. దేవుడి ముందు అందరూ ఒక్కటేనన్నారు. అలాగే ఈ ఉత్సవాలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా సహకరిస్తామని తెలియజేసారు. వ్యక్తిగతంగా కూడా ఏ అవసరం ఉన్నా కూడా సహకరిస్తానని ఈ సందర్భంగా తెలియజేసారు. అలాగే ఎప్పటి నుండో కోరుకొండ ప్రజల చిరకాల కల కోరుకొండ బస్ స్టాండ్ నుండి స్వామి వారి ఆలయం వరకు రోడ్డు విస్తరణ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని 2027 స్వామి వారి కల్యాణ మహోత్సవం నాటికి పూర్తి చేస్తామన్నారు.

అనంతరం స్వయంభు కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదములు స్వీకరించారు. స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం పోస్టర్ ఆవిష్కరించారు.

ఈ కార్యక్రమంలో కోరుకొండ శ్రీ లక్ష్మి నరసింహ స్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు, కోరుకొండ మండలం ఎంపీడీఓ, ఎమ్మార్వో, సిఐ, ఎక్సయిజ్ సిఐ, ఈఓపెడ్,పోలీస్ శాఖ అధికారులు, ఫైర్ డిపార్ట్మెంట్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు,ఆర్ డబ్ల్యూ ఎస్ డిపార్ట్మెంట్ అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ అధికారులు, ఎండోమెంట్ డిపార్ట్మెంట్ అధికారులు,ఆర్ & బి అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, జనసేన తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యమే కూటమి ప్రభుత్వ ధ్యేయం - మంత్రి కందుల దుర్గేష్





### మద్దూరును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని హామీ

**కొవ్వూరు, పెన్ పవర్, ఫిబ్రవరి 7:**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం గ్రామ స్వరాజ్యానికి పెద్దపీట వేస్తోందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా, కొవ్వూరు మండలం, మద్దూరు గ్రామంలో శనివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విస్తృతంగా పర్యటించారు. స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావుతో కలిసి సుమారు రూ. 1.30 కోట్లకు పైగా విలువైన పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. మొదటగా ఉపాధి హామీ పథకం కింద రూ. 43.60 లక్షలతో నిర్మించిన నూతన గ్రామ సచివాలయ భవనాన్ని మంత్రి ప్రారంభించారు. ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యేలా ఈ భవనాన్ని అత్యాధునిక వసతులతో నిర్మించినట్లు ఆయన తెలిపారు. అనంతరం రూ. 23.94 లక్షలతో నిర్మించనున్న రైతు సేవా కేంద్రానికి, గ్రామంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంలో భాగంగా రూ. 62.35 లక్షలతో వివిధ ప్రాంతాల్లో నిర్మించనున్న అంతర్గత సీసీ రోడ్లు, డ్రైన్ల పనులకు మంత్రి దుర్గేష్ భూమి పూజ చేశారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు, సాంకేతిక సలహాలు ఒకే చోట అందించే లక్ష్యంతో రైతు సేవా కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కూటమి నాయకులు మంత్రి దుర్గేష్ కి ఘనస్వాగతం పలకగా, శాస్త్రోక్తంగా కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ.. 2019-24 మధ్య గత ప్రభుత్వం రాష్ట్రాన్ని పూర్తిగా దోచుకుని ఖాళీ ఖజానాను అప్పజెప్పిందన్నారు. ఐదేళ్ల పాటు ఏ అభివృద్ధికి నోచుకోని ఏపీని, నేడు అనుభవజ్ఞుడైన సీఎం చంద్రబాబు నాయుడు తన పరిపాలనతో తిరిగి పట్టాలెక్కించారని తెలిపారు. పీఎం నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కేంద్ర సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి 'డబుల్ ఇంజిన్ సర్కార్' లా పరుగులు పెడుతోందని పేర్కొన్నారు. 2027 గోదావరి పుష్కరాల నాటికి అన్ని ఘాట్లను అభివృద్ధి చేస్తామని, ముఖ్యంగా కొవ్వూరులోని గోష్పాద క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీర్చిదిద్దుతామని మంత్రి దుర్గేష్ హామీ ఇచ్చారు. కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు చేస్తున్న కృషిని అభినందిస్తూ, తన వంతు సంపూర్ణ సహకారం అందిస్తానన్నారు. మద్దూరు సర్పంచ్ బాబ్జి ప్రజాసేవలో చూపిస్తున్న చొరవను మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా నిధులు కేటాయిస్తున్నామన్నారు. మద్దూరు గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. అభివృద్ధి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తాం అని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ పథకాలను మంత్రి దుర్గేష్ ఈ సందర్భంగా వివరించారు. ధాన్యం సేకరించిన 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్నారు. గతంలో ఆరేడు నెలలు అయినా డబ్బు జమ కాకపోవడం వల్ల రైతులకు జరిగిన ఇబ్బందిని వివరించారు. 'అన్నదాత సుఖీభవ' ద్వారా రైతులకు అండగా నిలుస్తున్నామన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను రూ.3 వేల నుండి రూ. 4 వేలకు పెంచామని, దివ్యాంగులకు రూ. 6 వేలు, దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు రూ. 15 వేలు అందిస్తున్నామన్నారు. మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, ఉచిత బస్సు సౌకర్యంతో మహిళల ముఖాల్లో చిరునవ్వు చూస్తున్నామన్నారు. కుటుంబంలో ఎంత మంది చదువుకుంటే అంతమందికి 'తల్లికి వందనం' ద్వారా ఒక్కొక్కరికి రూ. 15 వేలు అందించామన్నారు. మెగా డీఎస్సీ ద్వారా 16 వేల పైచిలుకు ఉద్యోగాల భర్తీ చేపట్టామని వివరించారు. పేదవాడి కంట కన్నీరు తుడవడమే లక్ష్యంగా రాజకీయాల్లోకి వచ్చిన పవన్ కళ్యాణ్ తన శాఖల ద్వారా ప్రజలకు విస్తృత ప్రయోజనం చేకూరుస్తున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ నిధులు సమీకరించి అభివృద్ధిని చేస్తున్నామన్నారు. పోలవరం, అమరావతి అభివృద్ధికి, ఇతర కార్యక్రమాలకు ఇతోధికంగా నిధులు సమకూరుస్తున్న కేంద్ర ప్రభుత్వానికి మంత్రి దుర్గేష్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కూటమి పార్టీల ముఖ్య నాయకులు, భారీ సంఖ్యలో గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఛీ.. తూ.. ఇదీ ఒక గెలుపేనా..

## పాకిస్తాన్ జట్టును పొట్టుపొట్టు తిడుతున్న ఫ్యాన్స్



**హైదరాబాద్ పెన్ పవర్:** గెలిచినా తిడతారు.. ఓడినా తిడతారు.. ఆడినా తిడతారు.. ఆడకపోయినా తిడతారు.. పాకిస్తాన్ జట్టు దుస్తితి ఇలా ఉంది. టీ 20 వరల్డ్ కప్ ఫస్ట్ డే.. గ్రూప్ ఏలో ఉన్న పాక్ జట్టు.. ఫస్ట్ మ్యాచ్ గా నెదర్లాండ్స్ టీంపై ఆడింది. పాకిస్తాన్ గెలిచింది. గెలిస్తే సంబరాలు చేసుకోవాలి కదా.. మరి తిడతారు ఏంటీ అంటారు.. అక్కడికే వస్తున్నాం.. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ జట్టు 20 ఓవర్లలో 147 పరుగులు చేసింది. ఆ తర్వాత 148 పరుగుల టార్గెట్‌తో బరిలోకి దిగింది పాకిస్తాన్. నెదర్లాండ్స్ జట్టు.. పిల్ల బచ్చా టీం.. క్రికెట్‌లో పిల్లకూన జట్టు.. పాకిస్తాన్ ఏమో పెద్ద పులి లెక్క ఫీలయ్యారు పాక్ ఫ్యాన్స్.. గ్రౌండ్‌లో సీన్ రివర్స్ అయ్యింది.. పాకిస్తాన్ జట్టు.. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి ఏకంగా 20 ఓవర్ల 3 బంతులు తీసుకుంది. అంటే జస్ట్ మూడు బంతులు మిగిలి ఉండగా.. టార్గెట్ ఛేజ్ చేసి గెలిచింది. ఇక్కడే పాకిస్తాన్ జనం.. పాక్ క్రికెట్ అభిమానులు రగిలిపోయారు..పిల్లకూన నెదర్లాండ్స్ .. 148 పరుగుల టార్గెట్ ఛేజ్ చేయటానికి 19 ఓవర్లు తీసుకోవటం ఏంటీ.. అంటే చచ్చీచెడీ.. కష్టపడి గెలవటం ఏంటీ... నెదర్లాండ్స్ బౌలర్లు అంతలా పాక్ జట్టును వణికించారా.. ఇలా అయితే మిగతా జట్లతో ఇంకేం ఆడతారు.. అంటూ తిట్టిపోస్తున్నారు పాకిస్తాన్ జనం.. ఫ్యాన్స్.. 2026లో పాకిస్తాన్ జట్టు బోణీ కొట్టింది. నెదర్లాండ్స్‌శ్రీపై 3 వికెట్ల తేడాతో విజయం సాధించింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్.. నెదర్లాండ్స్ జట్టును 19.5 ఓవర్లలో 147 పరుగులకు కట్టడి చేసింది. నెదర్లాండ్స్ జట్టు ఏడు వికెట్లు నష్టపోయి పాక్ ముందు 148 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. పాకిస్తాన్ జట్టు ఏడు వికెట్ల నష్టానికి 19.3 ఓవర్లకే 148 పరుగుల లక్ష్యాన్ని ఛేదించింది.

పాక్ బ్యాటర్లలో ఫర్హాన్ 47 పరుగులతో రాణించాడు. ఫహీమ్ అష్రఫ్ 29 (నాటౌట్), అయూబ్ 24, బాబర్ అజమ్ 15, సల్మాన్ అఘా 12, మహ్మద్ నవాజ్ 6, షాహిద్ అఫ్రీదీ 5 (నాటౌట్)గా నిలిచారు. నెదర్లాండ్స్ బ్యాటర్లలో స్కాట్ ఎడ్వర్డ్ 37, బాస్ డి లీడే 30, మైకేల్ లెవిట్ 24, ఆర్యన్ దత్ 13 పరుగులు చేశారు. పాక్ బౌలర్లలో సల్మాన్ మీర్జాకు 3 వికెట్లు, మహ్మద్ నవాజ్ 2, అబ్రార్ అహ్మద్ 2, అయూబ్ 2, అఫ్రీదీకి ఒక వికెట్ దక్కింది. నెదర్లాండ్స్ బౌలర్లలో ఆర్యన్ దత్ 2, పాల్ వాన్ మికరెన్‌శ్రీకు 2, వాన్ బీక్, కైల్ క్లైన్, రోలోఫ్ వాన్ డెర్ మెర్వేకు తలో వికెట్ దక్కింది.

# టీ20 వరల్డ్ కప్: రాణించిన హెట్మెయర్... విండీస్ 20 ఓవర్లలో 182-5

**టీ20 వరల్డ్ కప్ లో వెస్టిండీస్ వర్సెస్ స్కాట్లాండ్**


**టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న స్కాట్లాండ్**

**20 ఓవర్లలో 5 వికెట్లకు 182 పరుగులు చేసిన వెస్టిండీస్**



**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా స్కాట్లాండ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు భారీ స్కోరు సాధించింది. మిడిలార్డర్ బ్యాటర్ షిమ్రోన్ హెట్మెయర్ (64) హాఫ్ సెంచరీతో చెలరేగడంతో, నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 182 పరుగులు చేసింది. ఫలితంగా స్కాట్లాండ్ ముందు 183 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన స్కాట్లాండ్ కెప్టెన్ బౌలింగ్ ఎంచుకున్నాడు. దీంతో బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌కు ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (35), షాయ్ హోప్ (19) ఓ మోస్తరు ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, ఆ తర్వాత షిమ్రోన్ హెట్మెయర్ స్కాట్లాండ్ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కేవలం 36 బంతుల్లో 2 ఫోర్లు, 6 భారీ సిక్సర్లతో 64 పరుగులు చేసి స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. అతనికి రోవ్‌మన్ పావెల్ (24), షెర్ఫాన్ రూథర్‌ఫర్డ్ (26) కూడా వేగంగా ఆడి తమ వంతు సహకారం అందించారు.స్కాట్లాండ్ బౌలర్లలో బ్రాడ్ కర్రీ అద్భుతంగా బౌలింగ్ చేసి, 4 ఓవర్లలో కేవలం 23 పరుగులిచ్చి 2 కీలక వికెట్లు పడగొట్టాడు. సఫ్యాన్ షరీఫ్, మైఖేల్ లీస్క్, డేవిడ్‌సన్ తలో వికెట్ తీశారు.అనంతరం 183 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన స్కాట్లాండ్ ఆరంభంలోనే వికెట్ కోల్పోయింది. తాజా సమాచారం అందేసరికి స్కాట్లాండ్ 2.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 19 పరుగులతో ఆడుతోంది. జేసన్ హోల్డర్ బౌలింగ్‌లో మైఖేల్ జోన్స్ (1) ఔటయ్యాడు.

# రంగంలోకి శ్రీలంక.. భారత్‌తో మ్యాచ్‌పై పునరాలోచనలో పాకిస్థాన్?






**భారత్‌తో మ్యాచ్ బాయ్‌కాట్‌పై పునరాలోచించాలని పాక్‌ను కోరిన శ్రీలంక**

**మ్యాచ్ జరగకపోతే తీవ్ర ఆర్థిక నష్టాలు తప్పవన్న శ్రీలంక క్రికెట్ బోర్డు**

**శ్రీలంక అభ్యర్థనపై తమ ప్రభుత్వంతో మరోసారి సంప్రదిస్తామన్న పీసీబీ**

**సోమవారం నాటికి ఈ అంశంపై తుది నిర్ణయం వెలువడే అవకాశం**

**హైదరాబాద్ పెన్ పవర్:** టీ20 వరల్డ్ కప్‌లో భాగంగా భారత్‌తో జరగాల్సిన మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేయాలన్న నిర్ణయంపై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) పునరాలోచనలో పడింది. ఈ మ్యాచ్‌ను నిర్వహించకపోతే తీవ్రంగా నష్టపోతామని టోర్నీ సహ ఆతిథ్య దేశమైన శ్రీలంక విజ్ఞప్తి చేయడంతో... పీసీబీ ఈ అంశాన్ని మరోసారి తమ ప్రభుత్వంతో సంప్రదించాలని భావిస్తోంది.ఈ నెల 15న కొలంబో వేదికగా భారత్, పాకిస్థాన్ మధ్య జరగాల్సిన మ్యాచ్‌ను బహిష్కరించొద్దని కోరుతూ శ్రీలంక క్రికెట్ (ఎస్ఎల్‌సీ) పీసీబీకి ఒక ఈమెయిల్ పంపింది. ఈ కీలక మ్యాచ్ రద్దయితే తమ బోర్డుకు గేట్ మనీ, హాస్పిటాలిటీ అమ్మకాల రూపంలో భారీ ఆర్థిక నష్టం వాటిల్లుతుందని ఎస్ఎల్‌సీ అధ్యక్షుడు షమ్మీ సిల్వా.. పీసీబీ ఛైర్మన్ మొహ్సిన్ నఖ్వీకి నేరుగా వివరించారు. అంతేకాకుండా ఇది శ్రీలంకలో టోర్నమెంట్ ప్రతిష్ఠను దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

శ్రీలంకతో పాకిస్థాన్‌కు ఉన్న స్నేహపూర్వక సంబంధాల దృష్ట్యా వారి అభ్యర్థనను తేలిగ్గా తీసుకోలేమని పీసీబీ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం దేశంలో లేని మొహ్సిన్ నఖ్వీ, తిరిగి వచ్చాక ఈ విషయాన్ని పాక్ ప్రధాని దృష్టికి తీసుకెళతానని షమ్మీ సిల్వాకు హామీ ఇచ్చారు. శ్రీలంక విజ్ఞప్తిని పాకిస్థాన్ తిరస్కరించిందంటూ వస్తున్న వార్తల్లో నిజం లేదని, సోమవారం నాటికి దీనిపై ఒక స్పష్టత వచ్చే అవకాశం ఉందని ఆ వర్గాలు పేర్కొన్నాయి.వాస్తవానికి పాకిస్థాన్ జట్టు టీ20 వరల్డ్ కప్‌లో ఆడేందుకు ఆ దేశ ప్రభుత్వం అనుమతి ఇచ్చినా, భారత్‌తో మ్యాచ్ ఆడకుండా నిబంధన విధించింది. దీంతో పీసీబీ ఈ మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేస్తున్నట్టు ప్రకటించింది. గతంలో పాకిస్థాన్ పర్యటనలో తమ ఆటగాళ్లకు భద్రతాపరమైన ఆందోళనలు ఎదురైనప్పుడు, శ్రీలంక ప్రభుత్వం తమ జట్టును వెనక్కి పిలవకుండా టూర్‌ను పూర్తి చేసేలా ఆదేశించిందని, ఈ నేపథ్యంలో శ్రీలంక విజ్ఞప్తికి ప్రాధాన్యం ఏర్పడిందని విశ్లేషకులు అంటున్నారు.

# సొంత సంపాదన : ఈ టాలీవుడ్ హీరోల ఆస్తి ఎన్ని కోట్లంటే?

టాలీవుడ్ హీరోలు అంటే కేవలం వెండితెరపై మెరిసే నటులే కాదు, వారు పక్కా బిజినెస్ మైండ్ ఉన్న సంపన్న వ్యక్తులు కూడా. సినిమాల ద్వారా వచ్చే రెమ్యూనరేషన్‌తో పాటు రియల్ ఎస్టేట్, స్టూడియోలు, బ్రాండ్ ఎండార్స్‌మెంట్స్ మరియు సొంత వ్యాపారాల ద్వారా వీరు భారీగా ఆర్జిస్తున్నారు. మన అభిమాన హీరోల సంపాదన ఏ స్థాయిలో ఉంది? బాక్సాఫీస్ వద్దే కాకుండా ఆస్తుల విషయంలోనూ ఎవరెవరు ఏ స్థానాల్లో ఉన్నారో తెలుసుకోవాలనే ఆసక్తి ప్రతి అభిమానికి ఉంటుంది. ఆ వివరాలు ఇప్పుడు చూద్దాం.

**అగ్రస్థానంలో సీనియర్ స్టార్స్:**

టాలీవుడ్‌లో అత్యధిక ఆస్తులు కలిగిన హీరోల జాబితాలో కింగ్ నాగార్జున అగ్రస్థానంలో నిలుస్తారు. అన్నపూర్ణ స్టూడియోస్, కన్వెన్షన్ సెంటర్లు , ఇతర వ్యాపారాల ద్వారా ఆయన ఆస్తి సుమారు రూ. 800 నుండి 900 కోట్ల వరకు ఉంటుందని అంచనా. ఇక మెగాస్టార్ చిరంజీవి సుమారు రూ. 650 నుండి 700 కోట్ల ఆస్తులతో రెండో స్థానంలో ఉన్నారు. దశాబ్దాలుగా ఇండస్ట్రీని ఏలుతున్న ఈ సీనియర్ హీరోలు కేవలం సినిమాల ద్వారానే కాకుండా, తెలివైన పెట్టుబడులతో తమ సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నారు. వారి వెనకే విక్టరీ వెంకటేష్ (రూ. 120-150 కోట్లు), నందమూరి బాలకృష్ణ (రూ. 100-120 కోట్లు) కూడా భారీ స్థిరాస్తులతో కొనసాగుతున్నారు.







**గ్లోబల్ స్టార్స్ మరియు యువ హీరోల జోరు:**

ప్రస్తుత తరం హీరోల్లో మహేష్ బాబు, అల్లు అర్జున్, రామ్ చరణ్ మరియు ప్రభాస్ పోటాపోటీగా ఉన్నారు. మహేష్ బాబు తన సినిమాలతో పాటు ఏఎంబీ సినిమాస్, పలు బ్రాండ్ యాడ్స్ ద్వారా రూ. 350 నుండి 400 కోట్ల ఆస్తిని కలిగి ఉన్నారు. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ రూ. 350-370 కోట్లు, గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ రూ. 350 కోట్లు, మరియు పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ కూడా దాదాపు రూ. 350 కోట్ల మేర ఆస్తులు కలిగి ఉన్నట్లు సమాచారం. ఈ హీరోలు ఒక్కో సినిమాకు తీసుకునే భారీ రెమ్యూనరేషన్ వారి ఆస్తుల పెరుగుదలకు ప్రధాన కారణం అవుతోంది.

**మాస్ హీరోల ఆర్థిక సామ్రాజ్యం:**

మాస్ హీరోలుగా పేరు తెచ్చుకున్న జూనియర్ ఎన్టీఆర్ మరియు పవన్ కళ్యాణ్ కూడా ఆర్థికంగా బలంగానే ఉన్నారు. తారక్ ఆస్తి విలువ సుమారు రూ. 250 నుండి 300 కోట్ల వరకు ఉండగా, జనసేనాని పవన్ కళ్యాణ్ ఆస్తుల విలువ రూ. 200 నుండి 250 కోట్ల మధ్య ఉంటుందని అంచనా. వీరు కేవలం నటులుగానే కాకుండా వివిధ సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో యాక్టివ్‌గా ఉంటూనే, తమ సంపాదనను పక్కాగా ప్లాన్ చేసుకుంటున్నారు. మొత్తానికి టాలీవుడ్ స్టార్స్ బాక్సాఫీస్ కలెక్షన్ల రేసులోనే కాదు, వ్యక్తిగత ఆస్తుల విషయంలో కూడా రికార్డులు సృష్టిస్తున్నారు.

ఈ గణాంకాలను చూస్తుంటే టాలీవుడ్ హీరోలు కేవలం నటనకే పరిమితం కాకుండా, ఒక పక్కా వ్యూహంతో తమ ఆర్థిక భవిష్యత్తును నిర్మించుకుంటున్నారని అర్థమవుతోంది.



**పింక్ సాక్షి మాలిక్ సాఫ్ట్ గ్లామ్ మూమెంట్‌లో అందంగా ఉంది**



**నభా నటేష్ బ్లూ డ్రీమ్స్ మీకు నిద్రలేని రాత్రులను అందిస్తాయి**

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District-533003
Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com